మామిడి హరికృష్ణ




కవిత్వం

## MAMIDI HARIKRISHNA, THE POET

Mamidi Harikrishna hails from Shayampet village in Warangal district of Telangana State. He is one of the prominent poets in contemporary Telugu Literature. A government employee by profession, he is a poet, painter, writer, translator, essayist, historian, film maker and film critic by predilection. He is influenced by the world literature as well as the world cinema.

His poetry tries to portray the two ends of human agony and ecstasy in their myriad forms. His style is deeply rooted in the local dialect and lifestyles and with a blend of “native roots of naturalism” and changing times of “cosmopolitan ultra modernism”. He is a master graduate in Psychology and Education and his poetry tries to unravel and explore the unexplored plains of human psyche.

He had a credit of publishing thousands of essays on various topics like art, culture, heritage, literature, cinema, behaviour etc. which are published in National and International papers and magazines.

He introduced “Fusion Shayaree”, a novel style of poetry writing in Telugu literature in 2014 January, which gives scope and space to the multicultural and multilingual lives we live in contemporary society in literary format.

He had edited more than 45 books in Telugu and in English, which are unique in their nature and substance.

He published OORIKI POYINA YAALLA... (WHEN WE VISIT OUR HOME VILLAGE..), an anthology of poems written in Telangana language, in 2018.

He won the prestigious NANDI AWARDS FOR BEST FILM CRITICISM for the years 2009 & 2012, CINEGOER AWARD 2008 as BEST SCRIPT WRITER, INDYWOOD AWARD in 2018, ZEE CINE AWARD 2019 for promotion of the art of cinema & short films.

*Presently he is the Director of the Department of Language and Culture, Government of Telangana State.*

మామిడి హరికృష్ణ

# ఒంటరీకరణ



**స్వరాజ్యం పబ్లికేషన్స్**
804, రాయల్ పెవీలియన్,
అమీర్‌పేట్, హైదరాబాద్-16



# ఒంటరీకరణ

మామిడి హరికృష్ణ కవిత్వం

**Ontareekarana** *(A solitude)*

by *Mamidi Harikrishna*
*Cell: 8008005231*

First published on September, 2019
Price : Rs. 200/-     Copies : 1000
ISBN No. 978-93-5457-352-1
Cover painting & Illustrations by: ***Mamidi Harikrishna***

Published by & for Copies :
**Swarajyam Publications**
***Mamidi Jayakrishna***
# 804, Royal Pavilion Apartments, Opp. Big Bazaar,
Beside RBI Quarters, Ameerpet, Hyderabad.
E-mail: Harikrishnamango3@gmail.com
*& All leading bookshops.*

Printed at : ***Ritu Nestham Press***
IDA Balanagar, Ranga Reddy Dist.  Ph: 7416045979

---

© The poet
*No Part of this book may be reproduced without the prior permission of the poet.*

# అంకితం

చెల్లెళ్ళు - బావలు

కందకట్ల స్రవంతి – జనార్ధన్
మాసాని స్వాతి – రాజేంద్రప్రసాద్
బాసాని సుకృతి – పవన్ కుమార్ గార్లకు...

– మామిడి హరికృష్ణ

# ధన్యవాదాలు...


**అమ్మ** కీ॥శే॥ మామిడి స్వరాజ్యం

**నాన్న** డా॥ మామిడి సుదర్శన్

**తమ్ముడు** మామిడి జయకృష్ణ

**అల్లుళ్ళు - కోడలు**
గౌతమ్, హిమేశ్
హరిణి
సుదీప్‌శంకర్

**బాబాయిలు - చిన్నమ్మలు**
మామిడి సుధాకర్ - సరోజన - రచన-నివేదిత
మామిడి సురేందర్ - రాజమణి - రంజిత్-రాకేష్
మామిడి అశోక్ - రాజేశ్వరి - అరుణ్‌రాజా, అనూరాధ, అనూష

**అత్తమ్మలు - మామయ్యలు**
కీ.శే. దాసి మల్లికాంబ - కీ.శే. శ్రీహరి
కందగట్ల సుగుణ - కీ.శే. డా॥ చంద్రమౌళి
శిరుమళ్ళ శాంత - గోవర్ధన్
కీ.శే. బండారి సరోజని - కీ.శే. కుమారస్వామి

**పెద్దమ్మ - పెదబాపు కుటుంబం**
కీ.శే. గుర్రం విమల - కీ.శే. ముత్తిలింగం
గుర్రం సురేష్ - నిర్మల, శ్యాంబాబు - పద్మ
డా॥ రమేష్ - వీణ, సబ్బని సరస్వతి - రాజేందర్
బొడ్డుల రమ - మల్లయ్య, బలభద్రుల ఉమాదేవి - కృష్ణమూర్తి

**ఆత్మీయులు**
అయినంపూడి సరోజిని - శ్యాంసుందర్‌రావు
శ్రీలక్ష్మి - నాగేశ్వరరావు, నవ్యత-యశ్, హర్షిత-అభినవ్
చంద్రశేఖర్ - సుధ, సుబ్బారావు - బిందు
మహేశ్వర్ - మాధవి.

**- మామిడి హరికృష్ణ**

## కవిత్వం...
## ఊపిరాడని Suffocation నుంచి Liberation!!


ప్రశ్నార్థకం నుంచి ఆశ్చర్యార్థకం...!

ప్రశ్నార్థగోళంలో మిగతా అర్థగోళాన్ని మనం జవాబులు, సమాధానాలు, పరిష్కారాలు అని పేరు పెట్టాం! కానీ నిజానికి ఆ మిగతా అర్ధగోళం అంతా ఊహనల, అంచనాల స్వప్నాలమయమే...! అదే కవిత్వం! అంటే ఈ లోకంలో ఒక సగం అంతా ప్రశ్న అయితే మిగతా సగం అంతా కవిత్వమే!

అయితే, కవిత్వం గురించి నాకేమి తెలియును?

నిజానికి నాకు తెలిసిందల్లా – నాకు తెలుసనుకునే తెలీనితనపు అనంత ప్రగాఢ ప్రాక్కల్పనే! ఇక కవిత్వం గురించి నాకేమి తెలియును అంటే – తెలిసీ తెలియకుండా తెలుసుకోవాలనే కుతూహలపు కాంక్షను రగిల్చిన తెలియనితనం అనుకుంటాను...

ఇలా తెలియని తనం నుంచి తెలీనితనం గుండా తెలీనితనం వైపుగా జ్ఞానపు వస్త్రాలను ధరించి నగ్న పాదాలతో నడుస్తూనే ఉన్నాను.



అనిర్విరామ నడకలో నేను, 'తెలిసినతనం' మైలురాయిని చేరుకున్నాక పుస్తకంగా వేద్దామని అనుకున్నాను. కానీ ఆ తెలిసినతనం అనే Destination ఇక నా జీవిత కాలంలో నేను చేరుకోలేనని బండగా అర్థమయ్యాక నేనుకాస్తా 'అర్థమే' అయ్యి ...'No body is complete in this World. Everyone is in the process of becoming' అనే existential thought నన్ను కదిపి, కుదిపి తట్టిలేపాక ఇంత సుదీర్ఘకాలపు Hybernation తర్వాత ఇప్పుడు నా అక్షరాలనెత్తి లోకానికి చాటుతున్నాను.

నా ఈ తెలియని తనాన్ని చెప్పడానికే నా కవిత్వాన్ని ప్రకటిస్తున్నాను.

ఈ అక్షరాలను నిలువెల్లా కప్పుకుని, కవిత్వం ముసుగుని మళ్ళీ ధరించి నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను .. !

అయితే, కవిత్వం–కాలం ఒకలాంటివే... అనంత యాత్రికలు!
కాలానికి ఆది, పునాది లేదు... మనాది తప్ప!
కవిత్వానికి సోది, ప్రోది లేదు... అనాది అనుభవం తప్ప!!

నిజానికి కవిత్వం ఆదిమ మానవుని కాలం నుండే మనుగడలో ఉంది. లిఖిత రూపంలో లేకున్నా మనిషి మస్తిష్కంలో లిఖించబడుతూనే ఉంది... కాకపోతే కాలాన్ని లెక్కించే అమాయకత్వాన్ని మనం నిరంతరం reaffirm చేస్తూ ఉంటాం కనుక నేను కూడా ఆ అమాయకత్వానికి ఒకింత అజ్ఞానపు మెరుపును అద్దినవాణ్ణి కనుక ఈ 'ఒంటరీకరణ'లోని కవిత్వం 1993 నుండి 2003 మధ్య రాసిన వందలాది కవితలలోంచి కొన్ని selected poems గా గమనించాలని మనవి.

ఇక మళ్ళీ కవిత్వం గురించి నాకేమి తెలియును!

ప్రశ్నార్థగోళంలో మిగతా అర్థగోళాన్ని అన్వేషించే barbarion navigator భుజాలెక్కిన ముతక విల్లుకు వేళ్ళాడుతున్న బాణంలోని చురుకుదనంతో తరచి చూస్తే నాకర్థమయిందేంటో తెలుసా?

**అక్షరం** – నిత్య అసంతృప్తవాది...!

మనస్సు అనే పరమాణువులో, ఆలోచనలు అనే ఆర్బిటాల్‌లో అలజడితో, అలికిడితో నిరంతరం సంతృప్త స్థితి కోసం Elliptical Shape లో పచార్లు చేస్తూనే ఉంటుంది. పరిభ్రమిస్తూనే ఉంటుంది!

**పదం** – Unrest తో తండ్లాడే తాపసి...! ఉన్నచోట నిలవకుండా అర్థానర్థమో, అర్థరహితమో ఏదో ఒక వాక్యంగా పొదగడానికి నిత్యం సంచలిస్తూనే ఉంటుంది.

**వాక్యమ్** – insecurity తో బాధపడే లోకసంచారి...! ఒక్కకాడ ఆగకుండా గదిగదినీ వెతుక్కుంటూ లోకాలన్నీ కలియదిరుగుతూ నిత్య అభద్రతతో, చేతనాత్మక జాగరూకతతో ప్రయాణం చేస్తూనే ఉంటుంది.

కవిత్వం – మాత్రం ఒంటరే...!

Demographics లోని ఏకాంతవాసి...!

దాని దర్శనం మనం గుంపులో ఉన్నప్పుడు, మనలో గుంపులున్నప్పుడు సాధ్యం కాదు!

అన్ని వలువలూ, శాలువాలూ, భుజకీర్తులూ, గజమాలలూ, crowns, queries పరిత్యాగం చేసి నగ్న హృదయంతో మనల్ని మనం ఒలకపోసుకున్నప్పుడు, సాష్టాంగపడి వెక్కిళ్ళతో ఏడ్చినప్పుడు మాత్రమే కవిత్వం ప్రత్యక్షమవుతుంది. అలా నాకు గత దశాబ్దాల కాలం నుంచి సాక్షాత్కారం అవుతూనే ఉంది.

overt గానూ, covert గానూ గుంపులో లేని వాన్ని కదా ... ఇంపులు, కంపులేవీ పట్టని వాన్ని కదా! అందుకే నా తెలీనితనంలోంచి నాకు కొంచెం తెలిసిందాన్ని మీతో పంచుకుందా మనుకుంటున్నా... నాకు ప్రత్యక్షమైన అక్షరానుభవంలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నా...

నాకు అర్థమైనంతవరకూ –
కవిత్వం ఎప్పుడైనా ఒంటరే ...
కవితా సృజనే ఒంటరీకరణ ....!

సెప్టెంబర్ 2019

– **మామిడి హరికృష్ణ**



# ఒంటరిదారుల్లోకి...


| | | |
|---|---|---|
| 1. మహాజన విశ్వమ్ | *మార్చి 1-15, 1993* | 9 |
| 2. పునరావృతి | *22 ఏప్రిల్ 1993* | 11 |
| 3. నాగరికుడు | *26 ఏప్రిల్ 1993* | 12 |
| 4. ప్రహేళిక | *3 జూన్ 1993* | 14 |
| 5. సోమాలియా... సోమాలియా! | *24 జూన్ 1993* | 15 |
| 6. జూన్ 6 | *7 జులై 1993* | 18 |
| 7. అనార్ద్ర సముద్రం | *9 జులై 1993* | 20 |
| 8. తెగిపడిన శూన్యం నుంచి | *డిసెంబర్ 1993* | 22 |
| 9. చర్విత | *28 జనవరి 1994* | 23 |
| 10. ఒక హంస ఎగిరింది | *మార్చి 1994* | 24 |
| 11. యుగసృష్టి కోసం | *6-20 ఏప్రిల్ 1994* | 27 |
| 12. మునక | *17 జులై 1994* | 30 |
| 13. సోహమ్ | *ఆగస్టు 1994* | 31 |
| 14. గుప్పిట్లో ఎడారి | *25 ఆగస్టు 1994* | 33 |
| 15. Phoenix మరణం | *24 అక్టోబర్ 1994* | 34 |
| 16. అంతర్లోకం | *20 నవంబర్, 1994* | 36 |
| 17. నిర్జీవ జీవం | *18 డిసెంబర్, 1994* | 38 |
| 18. నిర్లిప్త ప్రసవమ్ | *అన్వేషణ వారపత్రిక 1994* | 39 |
| 19. చావని వాళ్లకో సంతాప గీతం | *13 ఫిబ్రవరి 1995* | 41 |
| 20. మృతిలో స్మృతికేళి | *19 ఫిబ్రవరి 1995* | 42 |

| | | |
|---|---|---|
| 21. ఏకాంత గీతం | *మార్చి 1995* | 43 |
| 22. ఏదో వొకటి | *24 ఏప్రిల్ 1995* | 44 |
| 23. నైమిషమ్ | *7 మే 1995* | 46 |
| 24. స్వప్న ప్రస్థానమ్ | *25 మే 1995* | 48 |
| 25. పున: పున: | *23 జూన్ 1995* | 51 |
| 26. పోరాటానంతర దృశ్యం | *జూన్ 1995* | 53 |
| 27. చినుకు | *10 జులై 1995* | 56 |
| 28. ఆదిమ ప్రశ్న | *25 డిసెంబర్ 1995* | 59 |
| 29. ఆలాపన | *20 మే 1996* | 62 |
| 30. ఒంటరీకరణ | *21 జూన్ 1996* | 64 |
| 31. దు:ఖానంద సందర్భం | *30 ఏప్రిల్ 1999* | 67 |
| 32. Duet | *17 ఏప్రిల్ 2000* | 69 |
| 33. నాలుగు లోకాలు | *25 ఫిబ్రవరి 2001* | 71 |
| 34. అయినా... | *20 ఆగస్టు 2001* | 73 |
| 35. దిగులు | *30 జనవరి 2002* | 75 |
| 36. మంచు జ్ఞాపకం | *జూన్ 2002* | 77 |
| 37. ఏడు వియోగ వీక్షణాలు | *28 జులై 2002* | 80 |
| 38. మెలుకువ స్వప్నం | *15 ఆగస్టు 2002* | 82 |
| 39. Solo | *19 ఆగస్టు 2002* | 83 |
| 40. అదు:ఖం | *15 డిసెంబర్ 2002* | 85 |
| 41. డజను వీక్షణాలు | *5 జనవరి 2003* | 87 |
| 42. Nothingness | *17 ఫిబ్రవరి 2003* | 89 |
| 43. ఒంటరిసముద్రం | *9 మార్చి 2003* | 91 |
| 44. ఒకానొక అన్యమనస్కకో అప్రేమ గీతం | *25 మే 2003* | 94 |
| 45. ఇంకా..... | *30 జూన్ 2003* | 97 |

# 1 మహాజన విశ్వం

Plastic పూలనీ
Imported Scent పరిమళాన్ని
Apartments కొండల్ని
ఐదు నక్షత్రాల పై కప్పుల్నీ
ఆకాశ హర్మ్యాల అంచుల్ని మాత్రమే
చూడగలిగే నువ్వు
తెలిసో తెలీకో
గడ్డి పూవునీ - పూరి గుడిసెనీ
రెండుకాళ్ళ రోడ్డునీ
గజ్జి కుక్క విదిలింపునీ
మన్ను తిన్న పాము విరుపునీ
రుమాలోడి అరుపునీ
ఎలా ఆస్వాదించగలవ్ ?

ఈ విశ్వాన్ని నీకున్న ఏదో ఒక అంగంతో
శాసించగలననీ - శపించగలననీ
విశ్వం మొహంపై
Acid వర్షాలను కురిపించగలననీ
Chrolo-Flouro-Carbonలను
కుప్పతెప్పలుగా పేర్చగలననీ
సాగరానికి అంచులు గీసి





ఒక్క అంగలో కొండల్ని దాటగలననీ
అరనిమిషంలో వెయ్యో వంతులో
ఆకాశాన్ని ఛేదించగలననీ
మట్టి చేతులు నాటిన 'చెట్ల' మొదళ్ళకి
విషం పెట్టగలననీ
పాముల్ని అద్దంలో బిగించి
సింహాన్ని తుపాకి Barrel లో బంధించగలననీ
ఈ విశ్వమంతటికీ
నీకు నువ్వు అధిపతిననీ అనుకుంటావ్ !

కానీ –
ఈ విశ్వంలో ఉన్న ఏ ఒక్క ధూళి కణాన్ని
అరగంట సేపు అదిమి పట్టినా
నీ శ్వాసకు కొసల్ని నిర్ణయించే
'మహా జన విశ్వం' కూడా
ఇక్కడే ఉందనే పచ్చి నిజాన్ని
Telescope నుంచి
గాజు కళ్ళతో చూసే
నీ 'Computer మెదడు' ఒప్పుకుంటుందా ?

*(ప్రజాపక్షం మార్చి 1-15-1993)*

# 2 పునరావృతి

ఒక శూన్యం
మరో దృశ్యం
        ఒకానొక రూపం!

ఒక రూపం
మరో పదం
        ఒకానొక పరిచయం!

ఒక పరిచయం
మరో అభివ్యక్తి
        ఒకానొక సమాగమం!

ఒక సమాగమం
మరో సంక్షోభం
        ఒకానొక శూన్యం...!

శూన్యమే శాశ్వతం –
మిగతావన్నీ Guest Appearanceలే!

***(22 ఏప్రిల్, 1993)***





# 3 నాగరికుడు

వర్షం కురిసింది
నింగి కుండకి చిల్లు పడిందేమో!

ఇన్నాళ్ళుగా ఇక్కడి అక్షాంశాలు, రేఖాంశాల పైన
International Date Line పైన
సముద్రాలు, ధృవప్రాంతాలపైన
పేరుకుపోయిన దుమ్మంతా కొట్టుకుపోయి
నవనవోన్మేష హరితంతో ఎంత జలదరించాయనీ....!

ధూళికణాలుగా రూపాంతరించడం తప్ప
మరేం పనిలేని మట్టి
అపుడే విరిసిన 'రాత్ కి రాణీ'లా
ఎంత పరిమళించిందనీ...!

ఇన్నాళ్ళుగా నిర్వేదంగా, నిర్లిప్తంగా బండ బారిన కొండలు
ఒక్కసారిగా ఎంత తేజోవంతమైనాయనీ...!

ఇప్పటిదాకా మునగదీసుకుని పడుకునే
మా ఇంటి కోడిపెట్ట, తెల్లపిల్లి, కలుగులోని ఎలుక
ఒడలు విదిల్చి ఎంత సంచరించాయనీ...!

అన్నీ అన్నీ అన్నీ పునర్ పునర్ పునర్జన్మ పొందినట్లే!

ఈ వర్షంలోనే శతాబ్దాల వారసత్వమూ
దశాబ్దాల అస్తిత్వమూ
అన్నీ ప్రక్షాళన మాత్రమే కాదు ప్రజ్వలనమూ అవలేదూ !

అయ్యయ్యో .... అక్కడెవరు నిలుచున్నది?
ఇక్కడ సకల చలనాచలన సృష్టి అంతా
వర్షధారల హర్షాతిశయంతో
మృణ్మయమై, తన్మయమై తారంగం పాడుతుంటే
అక్కడెవరు ఒక్కడెవరు నడుస్తున్నది....?

మోకాళ్ళ కంటా Shoes వేసుకుని
దేహానికి దళసరి Rain Coat చుట్టేసి
తలనిండా hood cap పెట్టేసి
ఒక్క తుహిన బిందువు చుంబననైనా
దోసిలిలోకి తీసుకోడానికి ఖాళీ లేకుండా
gloves తొడుక్కున్న చేతితో
Sophisticated Water proof గొడుగు పట్టుకుని...
అక్కడెవరు ఒక్కడెవరు నడుస్తున్నది?

***(26 ఏప్రిల్ 1993)***





# 4 ప్రహేళిక

జీవితం ఓ పద ప్రహేళిక
కొన్ని cue లు, clue లు ఉంటాయ్
అర్థమవుతాయ్ – 'అర్థమే' అవుతాయ్
అంతు చిక్కుతాయ్ – పొంతే దొరకదు!

అయినా –
నింపాల్సిన శూన్యాలు
పూడ్చాల్సిన గుంతలు
రాయాల్సిన అక్షరాలు
చెక్కాల్సిన నిమిషాలు
అద్దాల్సిన జ్ఞాపకాలు
ఎన్నో ఉంటాయ్!

Gap లను Fill చేయాలి
అసంపూర్ణతలను భర్తీ చేయాలి
పరుగునాపి ... నడకను నిలువరించి
ఒక్కసారి తిరిగి చూస్తే
ఇంకా ఎన్నెన్నో ఖాళీలు
మరెన్నో అసంపూర్ణ గడులు....

చిత్రంగా –
చాలా ఖాళీలను ఖాళీలతోనే నింపాక తెల్సింది
Life is an empty vessel
All the noise is just a bubble...!

***(3 జూన్, 1993)***

# 5 సోమాలియా... సోమాలియా!

మేం అనాగరికులమే
మా శరీరానికవతల ఓ ప్రపంచం ఉందని తెలీని అజ్ఞానులమే
ఓ పశ్చిమ పవనాల, పల్లవుల పచ్చ మనుషులారా!
మేం ఆదిమ జీవులమే
నల్లరంగును దేహాన్నిండా ధరించిన అనాధునికులమే!

మీరు Satellite అనీ, Star Wars అనీ
ఏవేవో మాకు తెలీని జీబ్రిష్ పదాలెన్నో
అలవోకగా పలుకుతుంటారు
మాకు Rocket తెలీదు – రొట్టె తెలుసు
టి.వి. తెలీదు – జావ తెలుసు
మాకు తెలిసిన మావైన పదాలు మాకూ ఉన్నాయ్
'అన్నం ..! ఆకలి...!!'

రొమాన్సు తెలీని రొచ్చు పీనుగులంటారేమో
కానీ మా Romance అల్లా పచ్చటి పొలం
మా Fantasy అల్లా పట్టెడు అన్నం... అంతే
ఇది చూసి, పచ్చకళ్ళే కాదు, ...
పచ్చ కళ్ళద్దాలు కూడా తగిలించుకున్న మీరు
'Poor Creatures..., Barbarians అని బిరుదులొదుల్తారు కదా.





చూడూ.... ఇక్కడెవరినైనా ముట్టుకుని చూడు!
ఇసుక పగుళ్ళు, బీటలు దేరిన భూములు
ఇంకి పోయిన దేహాలు
ఇక్కడి ఎండిపోయిన మట్టి అంతటా కర్కశ ఎముకలే తగులుతాయి

ఇక్కడెవరినైనా గిల్లి చూడు!
చమురు వస్తుందనో, Petro Dollars వస్తాయనో
రక్తం చిందుతుందనో, కనీసం కన్నీరు కురుస్తుందనో –
మీరు ఆశ్చర్య పడేంతగా
గట్టిగా అస్థికలే...!

మేం క్రితంలో భవనాల్లో, ఆకాశ హర్మ్యాల్లో జీవించకపోవచ్చు
కానీ కర్ర గూడుల్లోనో, మట్టి వాడల్లోనో నివసించాం
క్రితం తర్వాతనే కదా
ఎముకల గూడుల్లో
వెన్ను నంటిన చర్మం క్రీనీడల్లో నివసించడం మొదలెట్టింది!

ఓ మానవా! ఓ మనీషీ!
జాతి పేరుతోనో, మతం ముసుగుతోనో, రాజకీయ Label తోనో
మమ్మల్ని చులకనగానో, నిర్లక్ష్యంగానో చూడవద్దు

'రోదసీ సమరాల'ను విశ్వాంతరాళాల్లో ఊహిస్తున్న
ఓ భావుకుడా, భ్రష్టుడా –
నేలమీది నీ సహవాసి సంక్షుభితాంతరంగాన్ని చూడు!

సాయుధ వేషం ధరించిన ఓ సైనికుడా, సైంధవుడా–
శాంతి కపోతానికి అడ్డు రాకు!



నానా వర్ణ వజ్ర ఖచిత సింహాసనంపైని శునకమా, దమనకమా –
పులి చర్మం వదిలేసి, మేకలాగే
అచ్చం నీలాగే గొంతు విప్పు!

ఓ మానవులారా, మనీషులారా!
మీ Piano పై, మీ వీణపై మా కోసం ఓ గీతం పాడండి
మీరందరూ Chorus గా సార్వత్రిక గానం చేయండి
మేం నిలబడేంత వరకు పాడితే చాలు...

పాలక అంధులారా, అధికార బధిరులారా!
మాకెక్కడొచ్చిన పీడ అనుకుంటే
విస్మృత దేశం నుండి
తిరస్కృతి కవి ఒకడు
నలుదిక్కులా ఆక్రోశపు విత్తనాలను జల్లుతున్నాడు
కనీసం వాడి కన్నీళ్ళను తుడవండి...
పెద్ద ప్రేగులో సుళ్ళు తిరిగిన సంచలనం
గొంతులోకి ప్రవహించి
నిలువెల్లా కమ్ముకోగా
అక్షరాలతో అరంగ్రేటం చేస్తున్నాడు
కనీసం వాడితో గొంతైనా కలపండి...

"ఓ నా చీకటి సోమాలియా
ఓ ఆకటి సోమాలియా
ఓ కన్నీటి సోమాలియా
ఓ రుధిర సోమాలియా
నా సోమాలియా ...నా సోమాలియా....".

***(24 జూన్, 1993)***



# 6 జూన్ 6

ఎంత అణిచివేసుకుందామన్నా
తొక్కి పట్టిన స్ప్రింగ్‌లా సందేహమే, సందేహ దాహమే!

నువ్వు ఇలపై దేవుడవే
మానవ మాత్రుల మధ్య వాళ్ళ కతీతుడవే
అలా కానిదే పతులూ, రాజ్యపితలూ,
Bureaucrat లు, Technocrat లు, Aristocrat లు
నీ పాదాల చెంత ఎందుకు మోకరిల్లుతారు?

నువ్వు ఉన్నతుడవే, త్రికాలజ్ఞానివే
అలా కానిదే మేధోశిఖామణులూ, పండితాగ్రేసరులు, 'జ్ఞానులు'
నీ తరపున వకాల్తా ఎందుకు పుచ్చుకుంటారు?

అనాదికాలం నుంచి నువ్వు
జనాల్ని, జన గణాల్ని విజయవంతంగా నమ్మిస్తూనే వచ్చావ్
మొన్న చెట్టుని చూపెట్టావ్ – సాష్టాంగ పడ్డామ్
నిన్న రాతి బొమ్మని ముందుంచావ్ – చేతులు జోడించామ్
నేడు నేను దేవుడనన్నావ్ – తలపైకెక్కించుకున్నామ్
ఎప్పటికప్పుడు మేం గొర్రెలమే అవుతున్నామ్
డూడూ డూడూ బసవన్నలమే అవుతున్నామ్

వర్తమానపు వార్తామానం తర్వాత కూడా
తెర తొలగి నిజరూపం నగ్నంగా దర్శనమిచ్చిన తర్వాత కూడా
మమ్మల్ని నమ్మించే బాధ్యతని నీకే అప్పగించామ్

నువ్వు ఇలా పదికాలాల పాటు పచ్చగా వెలిగిపోవడం
నీ అమరత్వంలోనో, అతీతత్వంలోనో ఉందనుకుంటున్నావేమో
కానే కాదు –
అది మాలోనే, మా మదిలోనే ఉంది
మా జ్ఞానాజ్ఞానాతిజ్ఞానంలోనే ఉంది...!

అందుకేనేమో –
ఎంత అణిచివేసుకుందామన్నా
తొక్కి పట్టిన స్ప్రింగ్‌లా సందేహమే,
సందేహ దాహమే
సందేహ దాహ దేహమే....
సందేహ దాహ దేహ సందోహమే....

***(7, 8 జులై, 1993)***





# 7 అనార్ద్ర సముద్రం

ఇది సముద్రమే
నింగికీ నేలకూ మధ్య సంధానవారధిలా జన సముద్రమే!

* * *

ఆకాశంలోకి చొచ్చుకుపోయిన రంగుటద్దాలు
ఈ సముద్రంలోనే తళుకుబెళుకుతుంటాయి
పరుగెత్తి, పడిలేచే, పడుకునే వీధులు
బద్ధకంగానూ, ఒద్దికగానూ
చిరుచీకట్ల నిశిలోకే, నిషాలోకే జారుకుంటాయ్
ఫుట్‌పాత్‌పైని పాదముద్రలు, పదరేఖలు
వాహన విసర్జనాలలోనో
అనాశ్రిత అస్థిపంజర దీర్ఘనిద్రలోనో అడుగంటి పోతుంటాయి
'హరిత' హరిత వర్ణంతో బలహీనంగా
ఆకులని కొమ్మలని అనిష్టంగా కౌగిలించుకుంటాయి

ఇసుక దిబ్బలోకి తలను పాతేసిన ఆస్ట్రిచ్‌లు
మేఘాతీతమైన చూపులను విసిరేసిన చకోరాలు
గులకరాళ్ళను ప్రోగుచేస్తూ
నిండుకున్న కుండ అంచున నల్లకాకులు
అన్నీ ఈ సముద్రంలోనివే కదా!

నువ్వు చూస్తూవుంటావా
వీళ్ళంతా Plasma లోని Sperm లానే



శ్లేష్మంపై ముసిరిన ఈగలలానే
డయాబెటిక్ ఊమ్మి చుట్టూ వాలిన దోమల లానే

తెరలు – దొంతరలుగా
అలలు అలలుగా
కదులుతూ నడుస్తూ
అచ్చంగా సముద్రాన్నే స్ఫురింపచేయరూ?

అవును, ఇది సముద్రమే
వేనవేల మోహాల, భోగాల, రాగాల
మంద్రనాదమే
మంత్రరాగమే
యంత్రనాదమే ....!

కానీ నీకు తెలుసో లేదో –
Searchలూ, Researchలు ఎన్ని చేసినా
ఇక్కడ ఒక్క చుక్క నీటిచుక్కా రాలదు...
కన్నీటి చుక్క ఆవిరైపోదు ...

*(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 09, జూలై 1993)*



# 8 తెగిపడిన శూన్యం నుంచి...

గుండెని కబళించిన శూన్యం
మస్తిష్కాన్నే కాదు
మేధస్సునూ ఆవహించింది!

నిలువెల్లా ప్రాకిన శూన్యం
మాటకీ మాటకీ గొంతు కడ్డంగా
చూపుకీ చూపుకీ కనురెప్ప మాటుగా
అక్షరానికీ అక్షరానికీ నడుమ ముద్రారాక్షసంగా
తటాకంలో రాయిగా
మంచు సుషుప్తిలో Avalanche గా
చెట్ల ఆకుల సందుల్లోంచి సూరీడిగా

అస్పష్టమై, అలుక్కుపోయి, అల్లుకుపోయి
సందిగ్ధమై, సందేహమై, సంక్షోభమై
అబ్బబ్బబ్బ... ఎన్నెన్నెన్ని అవతారాలనీ

క్షణక్షణానికీ 'మైరావణమే' అవుతోంది తప్ప
నిర్వాణం పొందటంలేదు

సంశయంగా అక్కడే ఆగిపోయిన ప్రియతమా -
తొందరగా రావూ....?!

*(ఆహ్వానం మాసపత్రిక, డిశంబరు, 1993)*

# 9 చర్విత

ఉదయ కాలపు
ప్రశాంతత, నైర్మల్యత
తొడుక్కున్న కొత్త ముఖం!

మధ్యాహ్నపు
చిత్తడి, పుత్తడి సందడి
అతికించుకున్న చిర్నవులు – విషాదాలు!

సాయంత్రపు
విరాగాల చిరాకు, పరాకు
కరుగుతున్న మేకప్ మెరుపులు!

రాత్రికాలపు
నిశ్చలత, నిర్లిప్తత
అన్నీ త్యజించిన నగ్నత్వం...!

ఎన్నెన్నో అదృశ్య యుద్ధాల తర్వాత
ఏ అపరాత్రో నిరాశల మంచుబాకును
గుండెల్లో దింపుకున్న నిస్సిగ్గు నిద్ర!

మళ్ళీ చర్విత చర్వణమే!

***(28 జనవరి, 1994)***





# 10 ఒక హంస ఎగిరింది!

మా అమ్మమ్మ అంటూ ఉండేది
ఆడదై పుట్టటం కన్నా అడవిలో మానవడం మిన్న అని –
మాను కాదు హంసనే అయి వచ్చా...!

మా ఇంట్లో చూడ్డానికెన్నో ఉన్నాయ్
కలర్ టి.వి., ఫ్రిజ్, వాషింగ్ మెషిన్
గోడమీద బొమ్మ ... మా అమ్మ

ఇక ఇపుడు నా వంతు
నేను కన్రెప్పలు తెరవడానికి ముందే
నాకు ఆడతనమంటే ఏమిటో తెలిసింది
(తెలిసేలా చేశారనడం కరెక్టు)
“రాయంచ! రాయంచ!” అంటూ నన్ను
అంతఃపురంలోనో, అంతఃకుహరంలోనో బందీని చేశారు

అప్పట్నించీ –
నాకు రెక్కలున్నాయనీ
నేను ఎగరగలననే విషయాన్నీ మరిచే పోయా
అంతస్తుల ఇంటిలో ఒక చోట
నేను మానులా నిశ్చలమై

కళ్ళు నావైనా చూపు నాది కాని చోట
నేనేదీ కాని చోట
'నేనేతరమైన వాళ్ళు' నన్ను శాసిస్తున్న, శపిస్తున్న చోట
సుషుప్తిలోకి, గాఢ మనో నిక్షిప్తిలోకీ జారుకున్నా

* * *

హంసా ... హంసా ... నా సోదరి హంసా ...
ఇదంతా ఇక్కడ మాత్రమే అనుకుంటున్నావా
జన చైనా, రణ రష్యా,
భగ్న భారత్, నగ్న నమీబియా
ఆకలి కేకల సోమాలియా, అనాచ్ఛాదిత అమెరికా
ఎక్కడైనా ఇదే కదా !

సామ 'వాదాలు', 'సామ్యవేదాలు' వాదానికే తప్ప
వేదనల నివారణకు 'సంజీవని' కావని తేలిపోయింది కదా !
ప్రజాస్వామ్యాలూ, ప్రభుస్వామ్యాలూ
తీరిగ్గా మైకులు విరగ్గొట్టడానికే తప్ప
మైకం వీడి
మనల్ని మేలుకొలుపడానికి కాదని తెల్సిపోయింది కదా
పాఠాలు, విద్యాలయాలు Status Quoism ను పోషించడానికే తప్ప
మన Status ను ఇసుమంతైనా మెరుగు పర్చలేవని
Mecaulay సాక్షిగా రుజువయింది కదా

మరి ఇన్ని తెల్సీ గొంగళి పురుగులుగానే ఉండిపోదామా ?
లే ... లే ... మబ్బుల్ని తొలగించాలి !
సూర్యుడ్ని రాజేయాలి !!





అమావాస్య చంద్రుళ్ళను పౌర్ణమి వైపు నడిపించి
చీకట్లను ఛిద్రం చేయాలి...!

ఏకస్వర ఏకచ్ఛత్రాధిపత్యాన్ని ధిక్కరిస్తూ
మనమూ గళం విప్పాలి – మన గాథలు మనమే పాడాలి
మనమూ కలం తెరవాలి – మన పాటలు మనమే రాయాలి
వాడికెవడికో సంఘం అప్పచెప్పిన
Copy Right సర్వస్వామ్యాలను సర్వసమానం చేయాలి
మన తోటివారి మెదళ్ళలో సీతాకోక చిలుకలను ఎగరేయాలి
లే ... లే ...

* * *

హంస ఒళ్ళు కదిల్చి రెక్కలు విదిల్చింది
గాలిలోకి ఎగిరింది
అంతఃపురం నుండి అనంతాకాశం వైపుగా

స్వేచ్ఛాగీతాన్ని ఆలపిస్తూ
స్వాతంత్ర్య వాయువుల్ని ఆస్వాదిస్తూ ....

*(భూమిక, స్త్రీవాద పత్రిక, జనవరి – మార్చి 1994)*



# 11 యుగసృష్టికోసం ....

అపుడెపుడో
అందరమూ వేసవి రాత్రుల వెన్నెల సోనలను
దేహం నిండా పులుముకున్నవాళ్ళమే
వేప పూల జల్లులను నాలుక దోసిలి ఒగ్గి
మనసు నిండా పరుచుకున్న వాళ్ళమే
మామిడాకుల స్వాగతాలను
తలలు పంకించి హృదయానికి హత్తుకున్న వాళ్ళమే
వసంత సుందరి పచ్చ శరీరాన్ని
ముద్దుల వర్షంలో మునకలేయించి
ఆమెలోనే ఐక్యమౌతూ, ఆమెలోకే విస్తరిస్తూ
శ్వాసకీ శ్వాసకీ మధ్య భాషాతీతమైన మూలుగులని
పంటిగాట్లతో తీయగా గ్రోలిన వాళ్ళమే
నవయుగానికి తొట్టతొలి తోరణాలను ఆవిష్కరించిన వాళ్ళమే!

కానీ మొన్న ఏం జరిగిందో ఏమో !
అక్కడెక్కడో ధృవాల దగ్గర శిశిర పొర ఒకటి కన్ను తెరిచింది
వసంత సుందరి పచ్చదనం ఇంకిపోయి, ఇగిరిపోయి
'మొగాదిషు'[1] లోని ఎముకల గుట్టనుండి దూకి ఆత్మహత్య చేసుకుంది
నువ్వు, నేను, వాడి పెంపుడి కోడి
నీ ఇంటి ముందరి కుక్క, నా గుండెల్లో సుందరి
అన్నీ ... అన్నీ ... అన్నీ పారిపోయి పేలిపోయి రాలిపోయాయి



భూమండలమంతా శిశిరపూరితమై
గతించిన యుగాదుల సాక్షిగా శవభరితమే అయింది
ఇపుడిక్కడ ఉన్నది మనుషులనుకుంటున్నావేమో
కానేకాదు
సగం కాలిన దేహాలు ..
కుళ్ళిన శరీరాలు ...
విగత కళేబరాలే
అంతటా జీవచ్ఛవాలే ...!

ఉన్నట్టుండి ధారలా జారిన కన్నీటి ఉప్పదనం
ఘనీభవించిన శిలాజమే అవుతుంది!

అప్పుడు ఉగాది వస్తుంది!
కోయిల కూజితాల కొలనులో చిందులేస్తూ
కుహూ ... కుహూ ... గీతాల సంజీవనితో
మనల్ని సున్నితంగా స్పృశిస్తుంది !

ఇక చూస్కో–
శిశిరం శకలమై, శిథిలమై, ఎండుటాకై
మట్టి పొరల్లోకి మగతగా ఒదిగిపోదూ ?
దిగంతాలకావల శూన్యంలోకి పారిపోదూ ?

సరిగ్గా అపుడే –
కోయిల పచ్చపచ్చాని పాటల విత్తనాలను
మట్టి అంతటా వెదజల్లుతుంది



దిగంబర నేల చిట్ట చివరి అంచులో
మొట్టమొదటి మొలక చిగురు తొడుగుతుంది

పచ్చదనం ... ఎటు చూసినా పచ్చదనం
పంజరం దాటిన చిలుకలా
ఏకాకి ఎడారుల్లోంచి
మత్తుగా ఒత్తిగిలిన మంచులోయల్లోంచి పయనించి
మాయల ఫకీరు జడల మఱ్ఱిలో సైతం
పూలను తురుముతుంది!

అప్పుడు మాత్రం
కోయిల సింఫనీ కొనసాగుతూనే ఉంటుంది!

***(తేజ సమాజ పక్షపత్రిక, ఏప్రిల్ 6-20, 1994 సంచికలో ప్రచురితం)***
***(1994 రాష్ట్రస్థాయి ఉగాది కవితల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కవిత)***



# 12 మునక

పిలుపొచ్చింది...!

దిగంతాలలోంచి గాలిలో తేలియాడుతూ
మనః Canvass పైని గడ్డి పరకలకి
పచ్చదనం రంగుల్ని అద్దుతూ
నీ నుండి పిలుపొచ్చింది!

నువ్వేమని సంభోదించావో గుర్తులేదు
నేనేమని బదులిచ్చానో నేనూ జ్ఞాపకం పెట్టుకోలేదు

నీడని ముద్దెట్టుకోడం లాంటి సంభాషణ మొదలవుతుంది
శబ్దానికి శబ్దానికి మధ్య రాలిన మౌనంలో
యుగ యుగాల నుంచి నాకు పరిచితవే అనిపిస్తావు
మాట్లాట్టం మొదలెడ్తామా
శతాబ్దాల కాలం నుంచి తెలీని అజ్ఞాతిగా కనిపిస్తావు

ఏం చేయను ప్రియా!
నిన్ను అన్వేషించడంలోనే
మంచు ముద్ద లాంటి కాలం కరుగుతూంది

కరిగిన మంచు నీరై నన్ను క్రమ్మేస్తుంది
'బుడుంగ'ని మునుగుతున్న నాకు
అటువైపు నుండి
చిలిపిగానో, పరిహాసంగానో
నీ నవ్వే సెలయేటి గలగలలుగా వినిపించి
పెదాలు విచ్చుకుంటాయి...!

***(17 జులై, 1994)***

# 13 సోహమ్



మస్తిష్కపు హిమపాతం అవనతమై
కన్రెప్పల లోయలలోకి
కలలు కలలుగా జాలువారుతుంది
అనామక వేదనా సహజాతమేదో
పంచేంద్రియాలను గడ్డిపరకలోకి కుదించి
గాలిలోకి సుళ్ళు తిరుగుతుంది!

* * *

ఛిద్రుపలుగా రూపాంతరించిన జ్ఞాపకం –
ఇసుక నుండి వ్యోమ శకలం నుండి
నివురుగప్పిన విషాదానలంలోకి
క్షితిజ దిగంతాల మధ్య
ఉప్పెనల వారధులు కడుతుంది

అలుక్కుపోయిన వర్ణావర్ణ దృశ్యం–
గుండెకు అల్లుకుపోయి
నిట్టూర్పులోకి
ఎడారి వేడి నిశ్వాసలోకి
సంపూర్ణాంతర పరావర్తనమౌతుంది!



అందీ అందని అనుభవం
పెదాల తీరంలో కూరుకుపోయిన మౌన పడవై
సముద్రపుటలల వెక్కిళ్ళలోకి
'ఆధా హై చంద్రమా' గీతంలోకి
తర్జుమా అవుతుంది!

అసంపూర్ణ వాక్యమ్
నా నిరంతర ప్రేమిక ...!

*(ఆంధ్రభూమి దినపత్రిక ఆగస్టు 1994,*
*ఆదివారం అనుబంధంలో ప్రచురితం)*

# 14 గుప్పెట్లో ఎడారి

ఇక్కడంతా ఎడారి
నిన్ను వెదుక్కుంటూ
ఒయాసిస్సు కోసం వస్తాను

'ప్రేమ'గానే నువ్విస్తావు
గుప్పిళ్ళ కొద్ది ఇసుకని
వాకిట్లోనే నిలిపేసి...

***(25 ఆగస్టు, 1994)***





# 15 Phoenix మరణం

మనం నిరంతరం
మృత్యువుతో దోబూచులాడుతుంటామ్
మృత్యువు వసారాలోకి వచ్చి
తమకంగా మృత్యుకౌగిలిలో మంచు ముద్దకాబోయి
హఠాత్తుగా వెనక్కి లాగబడతామ్
'మరోజన్మ ... మరో జన్మ' గుసగుసలు లీలగా విన్పిస్తాయి!

* * *

చూడూ, మృత్యువుకీ నాకూ ఏడేడు తరాల బంధం ఉంది
గీజాపిరమిడ్ అంత ప్రాచీనమైంది
ఎవడ్రా నన్ను వెనక్కి లాగింది?
నన్ను వెళ్ళనీ ... నన్ను వెతుక్కోనీ ...

అంతర్ముఖం, అంతరార్థం, అంతరంగ అన్వేషణం
అన్నీ మృత్యువు తొడపై తల వాల్చినప్పుడే కదా!

అవనతమై పతనమైన గతమంతా అవగతం అయ్యేది
నా లొట్టపడిన చెక్కిలిపై మృత్యువు ఆర్తిగా ముద్దిడినప్పుడే కదా!

హిపోక్రటిక్ పలుకులు – పలకరింపులు
చిదిమిన పరిమళాలు – పెరికి వేసిన మొలకలు
రాలిపోయిన ఎండుటాకుల చప్పుళ్ళు జిలిబిలిగా వినిపించేది
మృత్యువు వక్షంపై చెవి ఒగ్గినప్పుడే కదా!

చూడూ, మృత్యువుకీ నాకూ జన్మ జన్మల బంధం ఉంది
రాకాసి గుళ్ళంత పురాతనమైంది
క్షణం క్రితం దాకా అనుభవాలు – అనుభూతులు – అనుభవాలే !

ఇపుడు అనుభవం మరణించింది
తీపి గురుతై, చేదు జ్ఞాపకమై, నిర్లిప్తస్మృతియై ....
ఇక్కడ ఇపుడు
కన్నీటికీ మృతి ఉంది!

తను పేర్చుకున్న చితిపైనే
శతాబ్దాల Phoenix బూడిదైరాలింది!

అస్తమించాడనుకున్న సూరీడు
తూర్పు దిక్కున మళ్ళీ ఉదయించాడు ....!!

*(ఉదయం దినపత్రిక 'రసన' 24 అక్టోబర్ 1994)*





# 16 అంతర్లోకం

ప్రతివాడికీ–
తనకోసం ఒక గది ఉండాలి
ఇరవై నాలుగు మంచుపల్లకీల్లో
ప్రతివాడూ తన కోసం ఒకటి అట్టిపెట్టుకోవాలి
పల్లకీ ఎక్కేవాడిలోనో, మోసే వాడిలోనో
తనను తాను తడుముకోడానికి ...!

***

ఏళ్ళ తరబడి అన్వేషించినా రాత్రి అంతం కాలేదు
గుండె నిండుగా కురిసిన శూన్యం సాక్షిగా
మనసు అంతటా విచ్చిన చీకటి మొక్కలకి
అసంతృప్తి ఆకులు మొలిచి
నిరాశ పూలు గుత్తులు గుత్తులుగా...

***

Soren[1] ...Soren
నేనెవ్వరో చెప్పవూ
Dali[2] ... Dali
నేనెక్కడున్నానో కుంచె గుర్తులీయవూ
నాకెంతో భవిష్యత్తుందంటున్నారు వీళ్ళంతా
Sartre[3] ... Sartre ...
ఇంతకీ భవిష్యత్తంటే ఏమిటోయ్?

---

1. Soren Kierkgard – డెన్మార్క్‌కు చెందిన తాత్వికుడు. అస్తిత్వవాద పితామహుడు
2. Salvador Dali – సర్రియలిస్ట్ పెయింటర్
3. Jean Paul Sartre – అస్తిత్వవాద దార్శనికుడు. నోబెల్ ప్రైజ్‌ను తిరస్కరించిన సాహితీశిఖరం



K[4]... K ...
ఆలోచనా రాహిత్యమూ ప్రేమరాహిత్యంలాంటిదేనంటావా!
భావనా ... భావనా
ప్రేమను నిర్వచింపుము?
సూజన్, సుమతి, సల్మా
అసలు నేనెవరో చెప్పి పుణ్యం కట్టుకోండమ్మా

ఇక్కడి అందరూ E.T.[5] లే
నా ప్రపంచానెక్కడ సమాధి చేశావో చెప్పు Moor[6]

వీళ్ళంతా అనవగాహనావగాహనాత్యవగాహనంగానే ఉన్నారు
నా Marx... నా Freud!
నాకో దుబాసీనివ్వరా ... ప్లీజ్!
బుద్ధా... ఆది శంకరా!
నన్నెక్కడ పోగొట్టుకున్నానో ఆనవాలు చెప్పండయ్యా!

అరే 'నేను' ను భౌతికాభౌతికాధిభౌతికం చేయమంటే
మీరంతా మౌనంగా నిష్క్రమిస్తున్నారేం !?

క్రమతని అతిక్రమించాననీ
డెల్ఫీ[7] ద్వారం లోంచి రాలేదనే కదా ....!!

***(ఆంధ్రభూమి 'సాహితి', 20 నవంబర్, 1994)***

4. *జిడ్డు కృష్ణమూర్తిని ఆయన శిష్యులు 'K' అని పిలుస్తారు.*
5. *E.T. - Extra Terrestrial (గ్రహాంతరవాసులు)*
6. *Thomas Moore - Utopia రచయిత.*
7. *ప్రాచీన గ్రీకు దేవాలయం - know thyself అక్షరాలను స్వాగత తోరణంగా రూపొందిన ఆలయం*



# 17 నిర్జీవ జీవం

జీవనాన్వేక్షణం ఎంతమాత్రమూ ప్రేమ పాత్రం కాదు
విషాద సూత్రమే
వైరాగ్య స్తోత్రమే
నైరాశ్య గాత్రమే
ఏకంగా
మృత్యువు క్రీగంటి చూపుల కటాక్షం కోసం
'ఘటం భింద్యాత్ ... పటం భింద్యాత్' లే!

మృత్యువూ.... మృత్యువూ !
నీ మంచు కౌగిలిలో నన్ను నలిపేయవూ
నీ శీతల పెదాలతో నన్ను గ్రోలవూ
నీ అగ్నికణికల నిశ్వాసాలతో నన్ను ఉక్కిరిబిక్కిరి చేయవూ
నీ పైటకొంగు మడతల నిశిలో నాకు కైవల్యం ప్రాప్తించనీయవూ

మృత్యువూ... నా తల్లీ !
అజీవమై నీ బుజ్జగింపులో
'జో అచ్చుతానంద'లను వినాలని ఉంది!

మృత్యువూ... నా ప్రాణ ప్రియా!
కన్రెప్పల లిప్తలలో దోబూచులాడుతున్నావు కదా–
మోహాతిశయంతో నీలో 'సాయుజ్యం' పొందాలని ఉంది....

***(18 డిసెంబరు, 1994)***



# 18 నిర్లిప్త ప్రసవం

ప్రసవ వేదన పడుతున్నాను –
ఈ ప్రపంచంలోకి ఒక కొత్తని ప్రవేశపెట్టడానికి
వెన్నెలున్న చోట వేకువనీ
వేకువున్న చోట మండుటెండనీ
ఎండ ఉన్న చోట వెన్నెలనీ పూయించడానికి
హృదయంతోనూ మస్తిష్కంతోనూ
నొప్పులు అనుభవిస్తూనే ఉన్నాను!

లుంగలు చుట్టుకు పోయిన శిశువు
మనసాంతర్గర్భపు లోలోపలి పొరలలో
పొర్లాడుతూ, పారాడుతూ, దోబూచులాడుతూ
ఊహల అట్టడుగు పరదాలలోని
అంతర్ అంతర్‌లోకాలలోకి
చిన్ని చిన్ని తప్పటడుగులు వేస్తూ, తుళ్ళిపడుతూ
నాకు అందక
నన్ను అందుకోక
బయటా పడక – బయటికీ రాక
నాకు ఎంత వ్యధను మిగులుస్తాడో కదా!

అయితే చిత్రమేంటో తెల్సా...
ఏక కాలంలో నేనే గర్భిణిని, నేనే మంత్రసానిని
గర్భదాత ఎవరని మాత్రం అడక్కండేం



నేనేదో తప్పు చేశానని కాదు
ఎవరని చెప్పాలో తెలీక... అంతే!

ఆలోచనా ఝరిలో కొట్టుకుపోతూ
పెన్ను క్రింద బాధననుభవిస్తూ
హృదయ నేత్ర గవాక్షాలను పూర్తిగా తెరుస్తానా
హఠాత్తుగా ఒక్క కేక వినిపిస్తుంది
అక్షరమై సాక్షాత్కరిస్తుంది...

పులకరింతలో సిరా
పలవరింతలో కాగితం మునిగి తేలుతాయ్
బెల్లం కొట్టిన రాయిలా నేను
ముద్దెట్టుకోను... ముక్కూ విరవను
కానీ
ఇంత వేదన అనుభవించిందీ
ఈ అల్పజీవి కోసమా అని మాత్రం ఆశ్చర్యపోతాను...

అన్నట్లు–
ప్రతి కవీ ఒక నిండు చూలాలు కాదూ?

***('అన్వేషణ' వారపత్రిక 1994)***



# 19 చావని వాళ్ళకో సంతాప గీతం

పాపం చచ్చిపోయాడు!

ప్రేమిక తిరస్కృతి బాణం, విశ్వరూపమెత్తిన తెరతార చూపుల తూటా,
పచ్చనోటు పరపరల Ultrasonics, నగరం గరమ్‌గరమ్ వడగాలులు,
పొడవాటి చిమ్నీల పొగ ఆక్సిజన్, ఆకాశంలో మరోసగం ఉరుములు,
నేలపై సహజీవుల అసహిష్ణుతా జ్వాల, ఎర్రటోపీ రంగులు...
ఏవైతేనేం ఒక్కోటీ ఒక్కో Jackal

చచ్చిపోవడం అంటే –
Auschwitz గిలెటిన్ దూకుడుకో
Gobels మిస్సైల్ తాకిడికో గాజుముక్కలవడం కాదు
తలల్ని ఎరలుగావేసి
గుండెల్ని యుద్ధసన్నద్ధం చేయడం
కాసింత అలుపు తీర్చుకుని
గగనమంత అసంపూర్ణ పోరాటాన్ని Galaxyలు దాటించడం...

అచావు రాబందుని కనుగుడ్ల చుట్టూ
గిరికీలు కొట్టించిందిక చాలు...

సహమృతా! చావుని పెదాల నవ్వులో పులుముకోనివాణ్ని
చేవలేనివాడిగా తేల్చిపారేద్దాం

అరేయ్ దసరాబుల్లోడూ!
బ్రతుకర్థం ఎలా తెలిసి చస్తుంది చెప్పు...

ఒక్కసారైనా చచ్చిపోకపోతే....!

***(ఫిబ్రవరి 13, 1995)***



# 20 మృతిలో స్మృతికేళీ

స్మృతులతో రతికేళీ ఆడుతుంటానా–
శిథిలాల మధ్య వీర్య శకలాలే
అంతర్వీక్షణల అగ్నినదికి ఆజ్యం పోస్తుంటాయ్!

అమృతత్వం కోసం పోరాడుతూ
నిరంతరం మృత్యువునే ముద్దెట్టుకుంటా!

నుదుటిలో నిక్షిప్తమైన క్షణాల పునరుత్థానం కోసం
గుండెలోని వ్రణాలను
మోకాలి గాయాలను కెలకక తప్పదేమో!

అష్టావక్ర ఆకృతులకు మెదడులో జన్మనిస్తూ
మునిపంట పెదాల్ని తామర రెక్కలు చేస్తాను కదా –

అదేంటో మూసిన దోసిలిలో గాలిని బంధించాలని కాంక్ష!

అయ్యో... సూర్యుడి కిరణాలకి శిరోజాల మేఘాలు అడ్డొస్తున్నాయ్
తప్పించండి...తప్పించండి...!

***(ఆంధ్రభూమి, ఆదివారం అనుబంధం 19, ఫిబ్రవరి 1995)***



# 21 ఏకాంత గీతం

మృతమానమైన సుదీర్ఘ దినాల పెంటకుప్పలోంచి
విస్మృత జ్ఞాపకాల ఇసుక మేటల సాక్షిగా
విచలిత హృదయంతో
సంచలిత పదాల సుమాలను గొంతు తాడుతో ముడేసి
అచలనంగానో, నిశ్చలంగానో
అనేకులని, అనేక కలలని అధిగమించి
ఈ ఒంటరి సముద్రపు అంచుల వెంట
ఏకాంత గీతాన్ని అనంతంగా ఆలాపిస్తూనేఉంటా!

మెట్లు మెట్లుగా కృంగిపోతున్న స్వరం
మోడు వారిన మోదుగు చెట్టు చిట్ట చివరి కొమ్మల కొనలలోంచి
లోయల్లో తనని తాను తడుముకుంటూ
పర్వత సానువుల్లో తనలోంచి తాను విడివడుతూ
నేల మీద గతుకు రోడ్డమ్మట తన సర్వస్వాన్ని ఖననం చేసి
ఎక్కడైనా నీ స్పర్శ తగలకపోతుందా అని
దేశాటన చేస్తుంది!

అదేంటో
ఇసుక నుండి ఈశ్వరుని వరకు
అన్నింటినీ – అన్నింటినీ
దర్శించగలిగిన నీ హృదయమేమో
నా గీతాన్ని స్పృశించడంలో ముకుళితమై.... కుంచితమై...

*('మందాకిని' మాసపత్రిక, మార్చి 1995)*



# 22 ఏదో వొకటి ...

ఇన్నాళ్ళ తర్వాత కూడా నువ్వు గుర్తురావడం ఆశ్చర్యమే !
నల్లమబ్బులు, వాన ధారలు, మంచుతెరలు విడివడ్డాక
నీలి నీలి ఆకాశపు నిగారింపులతో
హృదయం వివృతమయాక ....

మొన్నటి భూకంపానికి నేనే epicentre
Alas ... అపుడే నీ స్వప్నసౌధం కుంచించుకుని కుప్పకూలింది కదూ
ఎప్పట్లానే, అంతా జరిగాక కానీ 'సంబోధి' సంప్రాప్తించదు!

Blow-out అయిన ఘడియలన్నీ ఇంకిపోయి
జూలై రెండుకి వెనక్కి పరిగెడితే బావుణ్నేమో
ఇలా మరెప్పుడూ జరగదని హామీ ...
నమ్మకంగానే ...

ఇక ఇప్పుడు
Internationl Covention పై అరిగిపోయిన అక్షరాల దిగువన
ఆగిపోని సిరాతో మరో సంతకం జత చేరుస్తాను
పునఃపరిశీలించమని అభ్యర్థిస్తూ
ఇథియోపియో, సూడాన్, సోమాలియా శకలాలను ఎంక్లోజ్ చేస్తాను
ఒయాసిస్సును గుర్తించలేకపోయిన గుడ్డితనానికి
ఇసుక గుప్పిళ్ళతో గుండెలు బాదుకుంటాను

ప్రాణప్రియా, అన్నీ నేనే మాట్లాడి
నిన్నేమీ చెప్పనివ్వని Monologue
ఇక నుండి కట్ ... ఓ.కేనా?!

మ్యూజియం కత్తితో
పనస పండు తోలు వలచడాలు ఇక ఉండవ్,
సరేనా?!

నత్తగుల్లలోకి ముకుళించడానికి
నీ చీర కట్టు లోతులను ఆరా తీయడానికి ఇక Good bye...

ఇంకేం–
ఇన్నాళ్ళ తర్వాతైనా–
పోగొట్టుకున్న క్షణాల్ని పెదాలపై చెక్కుకుందాం
రాలిన ప్రేమ గులాబీలను కళ్ళల్లో పూయించుకుందాం
శైథిల్య నమ్మకాన్ని చేతి రేఖల్లో లిఖించుకుందాం
విచ్ఛిన్న రహస్యాన్ని కౌగిలింతల్లో కప్పెడదాం ... రా!

టాగోర్‌పై ఆన ... పున్నమి సాక్షి
'ఎన్ని యుగాల నిరీక్షణ ఫలితమో కదా –
ఒక్క నువ్వు !'

***(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 24, ఏప్రిల్ 1995)***





# 23 నైమిషం

జీవన కొలనులోని కృత్రిమత
ఆకు కింది నీరులా తగులుతుంది ... తడిగా!

అద్వైతమనుకున్న అపరాహ్ణం
భళ్ళున బద్దలవుతుంది ... రెండు పాయలుగా!

కలల ముసుగు ధరించిన నగ్న రెబెకా
పిట్టలన్నీ ఎగిరిపోయాక
నిశ్శబ్ద వాయు తంత్రులను మీటుతున్న చిగురుటాకే అవుతుంది!

నింగికెగిసిన చిలకొకటి
హఠాత్తుగా చెరువులో మునకేసి
రెండ్రోజులాగి ఒడ్డున శవమై కదుల్తుంది!

అలలపైకి నడిచివెళ్ళిన పాదముద్రలు
ఒక్కటీ ఘనీభవించవు
తీరంలో పిట్టగూడు ఎంతకీ తుదిమెరుగులు దిద్దుకోదు
స్తబ్దమైన కంటిపాపలో మాత్రం రేఖ్ళు రేఖ్ళుగా
రంగుల మేడ సందడి చేస్తూ ఉంటుంది!

ఏ ప్రకంపనల వంచనకో
చెల్లాచెదురైన ఇసుక రేణువులు మాత్రం
సన్నగా గొణుక్కుంటాయి ....
'నేను ప్రేమించాను' అని !

*(ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం 07 మే 1995)*





# 24 స్వప్న ప్రస్థానమ్

స్వప్నాలు
నపుంసకుడి స్ఖలనాలంటావేమో
కానేకాదు!

* * *

స్వప్నమ్ –
ఒక కుమ్మరి పురుగు
గుండెను డొల్ల చేస్తుంది
హృదయాంతరాళాల్ని పెళ్ళగించి పెకిలించి
నీవైపు వెకిలిగా ఇకిలించి
నువ్వెంతగానో ధృవపర్చుకున్న
మనసు కాగితపు పులి రంగు చెదరగొడ్తుంది!

స్వప్నమ్–
ఒక కరవాలం
నిన్ను తుత్తునియలు చేసి un-gestalticగా చూపిస్తుంది
Delphi ఆలయం పైని ద్విపదాలను దిగ్విజయం చేస్తుంది

స్వప్నమ్ –
కనుపాపను కప్పేసిన కన్రెప్పలకు అటువైపు ప్రపంచం!
అంతరంగ తరంగాల తురగలకు ఆలవాలం
'Beyond Itself' అని కళ్ళు తెరిచి అంటావే ... అది!

స్వప్నమ్–
లీలగా, అస్పష్టంగా ఆవిష్కృతమై
అధోజగత్తులోని Open-castలు, inclineలను సాక్షాత్కరింపచేస్తుంది
నీ అంత inorder గానే, అసంబద్ధంగానే!

అన్నట్లు, విప్లవాలు ఎక్కడో లేవు
నీ లోనూ ... నీ లోనే
ఎప్పుడో గుప్పిట్లోకి కుదించబడ్డ మేఘం
ఎక్కడో తుహినమై, తుషారమై, కుంభవృష్టై
నిలువెల్లా ముంచేసి జలదరింపజేస్తుంది
కన్ను తెరిస్తే చాలు జలధారలు ... జలధారలే!

అవును, దేనికైనా నిన్న మొన్నలే పునాదులు
స్వప్నమ్ కూడా
నీ జననమంత ప్రాచీనమైందే కదా!

* * *

హిప్నోస్[1] .... హిప్నోస్!
నాకో స్వప్నాన్నీయవూ...
వాస్తవం వింతైనదే
అలా అని Monotonyని ఎంతకాలం భరిస్తాం చెప్పు!

నేల మీద నడవాల్సిందే
అలా అని ఆకాశం వంక తలెత్తకూడదంటే ఎలా?



1. గ్రీకుల నిద్రాదేవత



హిప్నోస్ ... హిప్నోస్...!
నాకో స్వప్నాన్నీయవూ
తోడా సా రుమానీ కోసం
ఒకానొక Catharsis[2] కోసం...!

స్వప్నమ్ –

ఒక నిరంతర ప్రస్థానం
అది 'Transe' Siberian అంత సుదీర్ఘం!

ప్రతివాడూ స్వాప్నికుడే
అస్ఖలితుడెవడైనా ఉన్నాడా ....!

*('అన్వేషణ' వారపత్రిక **25** మే **1995** సంచికలో ప్రచురితం)*

*2.* ఆత్మ ప్రక్షాళన

# 25 పున: పున:

వర్షం –
అపుడెపుడో ఏ శాపవశాత్తో
విడిపోయిన ప్రేమికుల తరగని అనురాగ హర్షమేమో –
జడి జడిగా  జల్లులు జల్లులుగా కురిసింది!

నింగి ప్రేమ సందేశాలు
మేఘ వాహనాల్లో బరువెక్కి బరువెక్కి
చినుకాక్షరాలుగా రాలాయేమో–
నేల నిలువెల్లా తడిసిపోయింది!

ఇప్పటిదాకా–
ఇక్కడి చెట్లు, ఆకులు, బెరళ్ళు
మంచుపొగ బురఖాలను కప్పుకుని ఉండేవి
ఇపుడే కదా –
నగ్న హరిత దేహాలతో
గాలి ప్రేమికుడి గాఢ పరిష్వంగంలోకి ఒదిగిపోయింది!

ధూళి కణాలుగా విచలితమైన మట్టి
ఈ క్షణమే కదా
చినుకు చుంబనల పరిమళాలను
గుండెల్లో పొదువుకుని సువాసించింది





నిర్వేదంగా, నిర్లిప్తంగా బండబారిన కొండలు
ఈ నిమిషమే కదా
దీర్ఘకాల విరహానంతర సంయోగ సందడితో తేజోవంతమయింది!

ఇంతవరకూ మునగదీసుకుని పడుకున్న
కోడిపెట్ట, తెల్ల పిల్లి, కలుగులోని ఎలుక
క్రితం తర్వాతే కదా–
ఒడలు విదిల్చి ప్రేమయాత్రకై బయలుదేరింది!

అన్నీ పునర్‌పునర్ పునర్జన్మ పొందినట్లే అవలేదూ?!

ఈ వర్షంలోనే–
శతాబ్దాల వారసత్వమూ
దశాబ్దాల అస్తిత్వమూ కలిసి
ద్వంద్వతలోని శూన్యాన్ని
సమాగమ ఏకత్వ స్మృతితో నింపడానికి
యుగాల నాటి అన్వేషణని
మళ్ళీ మొదలెట్టలేదూ?!

ఒక్క చినుకు కదలిక –
విస్మృత ప్రియా,
సృష్టిని మొత్తంగా పునరావిష్కరించినట్లు లేదూ....?!

***(ఆహ్వానం, 1995)***

# 26 పోరాటానంతర దృశ్యం

శతాబ్దాల కాలం నుంచి
యంత్రానికీ నాకూ మధ్య
ప్రచ్ఛన్న పోరాటం సాగుతూనే ఉంది!

***

రైల్లో ఒక మూల –
నేను నిశ్చలమై పడిపోయిన తర్వాత కూడా
పొడవాటి కూతతోనూ – చిన్న కుదుపుతోనూ
రైలు నన్ను సవాలు చేస్తుంది
అది నా మేధోశిశువే అనే నిజాన్ని
Sleeper దిగువన ఖననం చేసి
చక్రం దువ్వుతూ నా వైపు చూస్తుంది!

***

పట్టాల మీదుగా, బిగిసిన ఇనుప Bridge ల దురుసుతనం మీదుగా
ఆకాశంలోకి తలలు దూసిన చెట్ల నిబ్బరం మీదుగా
పచ్చని పరదాలను నిలువెల్లా కప్పుకున్న పొలాల నిండుకుండల మీదుగా
బీడుబారి పగుళ్ళుదేరి దాహం గొన్న భూముల స్వప్నాల మీదుగా
మేం పరుగు పందెం మొదలెడతామ్!

***

ప్రక్కనున్న కాలిబాటపైని పాదముద్రలని చెరిపేస్తూ
బురద నీటిలో సగం మునిగిన ఆంబోతును దాటేస్తూ





చేల పైని కొంగల గుంపుని చెదరగొడ్తూ
రాటు దేలిన రాళ్ళ గుట్టల్ని
గాఢమైన వేసవి గాలుల్ని చీల్చుకుంటూ
మేం పరుగు పందెం మొదలెడతామ్!

అదే క్షణంలో ఇక్కడే –
ఒకడు జోగుతుంటాడు –
తలని పక్కవాడి భుజంపై వాల్చేసి నిశ్చింతను ఫీల్ అవుతాడు
అంతలోనే ఏదో కోల్పోతున్న వాడిలా త్రుళ్ళిపడి లేస్తాడు
ఒకడు వాగుతుంటాడు –
ఆ మాటలన్నీ కిటికీలోంచి బయటికి జారుకుని
పట్టాకి–రైలు చక్రానికి మధ్య నలిగి సాగిన పదిపైసల బిళ్ళే అవుతాడు!

పిల్లన గ్రోవితో ఒకడు
భక్తి పదాలు పాడుతూ ఒకడు
సినీ పాటలను ఊదరగొడ్తూ ఒకడు
సీటు క్రింది వేరుశనగ పొట్టుకు
తన లేత చర్మపు రంగును అద్దుతూ ఒకడు
కాళ్ళను చుట్టిన బూట్లకి
తన బాల్యపు పాలిష్ పూతలను పూస్తూ ఒకడు
ఏమేమో లేని వాళ్ళంతా ఏమేమో లేని వాళ్ళ దగ్గరకి వస్తారు
'సన్నాసి సన్నాసి' తరహాలో
జేబుల బరువూ తగ్గదు – గుప్పిళ్ళూ నిండవు!



పరుగు పందెం కొనసాగుతూనే ఉంటుంది
నన్ను పరాజితుడ్ని చేయాలని
రైలు ఏవేవో కుట్రలు పన్నుతూనే ఉంటుంది!
ఐనా పరుగు పందెం ఆగదు
రైలు వెనక నేను ... నా వెనుక రైలు
పరుగు ... పరుగు .. పరుగే పరుగు
మేఘాలే ప్రేక్షకులు – సూర్యుడే Umpire!

తీరా లక్ష్యాన్ని చేరాక
ఒక అద్భుతం ఆవిష్కరించబడ్తుంది
స్టేషన్‌కి రైలు చేరడానికి చాలా సేపటి క్రితమే
వేల మంది జనాల ఉదాసీన ఉరుకుల పరుగుల మధ్య
అక్కడి సిమెంట్ బెంచీపై
తల చుట్టూ Athenian Olive కొమ్మలతో
మెడలో మెరిసిపోతున్న సూర్య కిరణాల పతకంతో
విజయ సంకేతంగా నవ్వుతూ ....
నేనే ... !

***(ఆహ్వానం మాసపత్రిక జూన్ 1995 సంచికలో ప్రచురితం)***



# 27 చినుకు

*The storm is like the cry of some god in pain, whose love the earth refuses.*

**-Rabindranath Tagore**

అల్లంత ఎత్తు మేఘాల ఊయలలోంచి
కేరింతల ఉరుములతో, చూపుల మెరుపులతో
పసి పిల్లాడికి మల్లే ఒక్క గెంతు వేస్తుంది ... చినుకు!

నిరీక్షిత సరస్సు ఒళ్ళు ఒక్కసారిగా జలదరించి
వలయవలయాలుగా పరుగులెత్తి
ఒడ్డుపైని గడ్డిపూవుని నిలువెల్లా క్రమ్మేస్తుంది
సోలిపోయిన పూలు పునరుత్థానమై
సూర్యుడితో కరచాలనం చేస్తాయ్!

పెదాలు పెదాలుగా పరవళ్ళు తొక్కిన చినుకు
మూడంకె వేసి పడుకున్న గడ్డి పరక నుదుటిపై
తడిపుత్తడి ముద్దులతో ఊపిరులూదుతుంది
అనార్ద్రమైన గడ్డి పరకలు పునరుజ్జీవమై
నేల ఒడిలోకి వేళ్ళని చాపుకుంటాయ్!

ఇప్పటిదాకా చిటపటలాడిన మట్టి వేడి నిశ్వాస
చినుకు చుంబనంతో



ధ్యానంలోకెళ్ళిన మౌనమునే అవుతుంది
తలలపై, తలపులపై కుంపట్లను రాజేసిన సూర్యుడు
చినుకు చిర్నవ్వుకు
సిగ్గులమొగ్గయి
మబ్బుల వెనక ముఖం దాచుకుంటాడు!

ఇక ఇపుడంతటా ప్రమోదమే –
కనుచూపు మేర దృశ్యమంతా
నీటిలో మునిగి తేలిన ముఖమల్ గుడ్డే అవుతుంది
అపుడెపుడో వేసిన చిత్రానికి ఇపుడే రంగులద్దినట్లు
ఆకులన్నీ, రోడ్లన్నీ, కొండలన్నీ, ఇళ్ళపైని కప్పులన్నీ
చిక్కదనపు వర్ణాలతో తడిసి తబ్బిబ్బవుతాయ్!

నింగి అసాంతం నల్లబడి
చినుకుల దారాలతో
నేలపై పచ్చ పరికిణీని 'కల' నేస్తుంది!

అంతటా అనిమిష సౌందర్యమే
అంతటా అదుపులేని ఆనందమే తాండవ నృత్యం చేస్తుంది!

కాలవగట్టు, చెరువుకట్ట, సాగర తీరం
సందడి సందడిగా
నీటి ప్రవాహపు వీణ మెట్లపై
సంతోష స్వరాలను అలవోకగా పలికిస్తాయ్
సమ్మోహనం చేసే తడిదనపు Symphony
అలలలలుగా విశ్వాన్నంతటినీ ఆవహిస్తుంది!



అవును, చినుకు –
వాళ్ళందరి నిలువెత్తు ఆశల సంక్షిప్త రూపమే
క్షణ క్షణ వీక్షణలు ఘనీభవించి దాల్చిన అంతిమ రూపమే!

నా ప్రియమైన భాష్యకారుడా!
మరి, అనాహూత తుఫాను గుండె వేదనల్లోంచి
హఠాత్తుగా పెల్లుబికిన చినుకునేమనాలి?
ఒక అనామకలోకంలోని
ఒకనొక తిరస్కృత ప్రేమికుడి కన్నీటి పాట అందామా?

వర్షం ఎప్పుడూ హర్షమే కానక్కర్లేదు కదా !

*(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 10 జూలై 1995)*

# 28 ఆదిమ ప్రశ్న!



భ్రూణదశనుండే మొలకెత్తిన ప్రశ్న ఇది
బహుశా అంతకన్నా ముందరే అయుండొచ్చు
ఎవడు చూసొచ్చాడు కనుక!

దీవులలో దీపం రాజుకుని
మట్టిలోంచి నిటారైన వెన్నెముకలు
గాలిలోంచి కలలపిట్టలు
ఆకుల్లోంచి ఆశాలతలు
ప్రవాహాల్లోంచి కోర్కెల విత్తనాలు
తిమిరంలోంచి విశ్వాసాల చీకట్లు
ఒక్కొక్కటిగా ప్రభవించిన నూతన సృష్టికి
ప్రథమ ప్రేక్షకుణ్ని –
నేను!

పరవశమై పాటపాడి
తన్మయమై తాండవమాడి
మమేకమై చిత్తరువునేసి
మైమరచిన మోహంలో అక్షరాన్ని పేర్చి
ప్రపంచాన్ని పట్టుకోలేకపోయానే అని
దీర్ఘ నిట్టూర్పుల నిరాశను నా నిండా కప్పుకుని
చతికిలబడిన నటుణ్ని –
నేనే!!



మొన్నెవరో వచ్చి
అదో, ఆ బావిని చూపించి అందులోకి నడవమన్నాడు
నిన్నొకాయన కలిసి
ఇదో, ఈ కొండెక్కించి చుట్టూ చూడమన్నాడు

ఇక ఇప్పుడు –
అసంపూర్ణత తాలూకు అసంతృప్తేదో విశ్వరూపమెత్తి
నన్ను మరుగుజ్జును చేసి
తిరిగి Protozoa లోకి సంలీనపరిచాక
భ్రూణదశనాటి ఆదిమ ప్రశ్న చిగుళ్ళేసింది–
"నేనెవరు" అని!?

నేనంటే దేహం!
కాదు నేనంటే ఆత్మ!!
కాదు కాదు, నేనంటే ఏదీకాదు!!!
ఏదీకానిది ఏదీ లేనిది ఏమీకాదు కదా?!
'అహం బ్రహ్మాస్మి'
బ్రహ్మంటే ఏదీ లేనిదనా?
సరే అయితే, ఏదీ లేనిది ఎప్పుడూ ఏమీ కానిదే అవుతుంది
ఏమీ కానిది ఎప్పుడూ ఏదీ లేనిదే అవుతుంది
ఛ ... లేనిదాన్ని గురించి చెవులు కొరకడం
నా అభిమతానికి విరుద్ధం!

ఐనా ఎవరి గురించి వారే చెప్పడం న్యాయం కదా
నేనంటే –
దృశ్యమాన ఆత్మ!
అదృశ్య దేహం!



పారదర్శకమైన ఆత్మ
అస్తిత్వ నిరూపణకోసం ఎత్తిన అవతారమే కదా దేహమంటే !
స్పృశామానమైన దేహం
అనంతత్వ సాధన కోసం దాల్చిన ఆకృతే కదా ఆత్మంటే !

మరి నువ్వెక్కడ అని
ముఖంలో ప్రశ్నార్థకాలను శృతిచేస్తున్నావ్ కదూ?!

దేహాత్మల మధ్యన విభజన రేఖపై
శిఖరాయమానంగా నిశ్చలమై ఒకసారి
ఇరు బిందువుల నడుమ Pendulum లా మరొకసారి
రెండు ధృవాలమధ్య ఖోఖో క్రీడిస్తూ ఇంకోసారి
భ్రమణ పరిభ్రమణల భ్రాంతులను
చక్షువులతో అనుభూతిస్తూ మరోసారి...

అలా, గింగిరాలు కొడుతూ - గలగలా పారుతూ
గిరగిరా తిరుగుతూ తిరుగుతూ
ఆత్మ అంతా చూపుడు వేలిలోకి కుదించబడి
నిన్ను చూపెడుతుంది !

ఆదిమ ప్రశ్నకి అనాది సమాధానం దొరికింది!!

***(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 25 డిసెంబర్, 1995)***



# 29 ఆలాపన!

Dasein ... Dasein[1] పదాలను వెంట్రుకకు సైతం చుట్టి పదార్థాత్మల వేర్పాటురాహిత్యాన్ని కాలిగోరుపై బొంగరం చేసాక లోకాతీత చేతనలేవీ కానరాని చీకట్లలో రాత్రీకరణమైన ఎదుర్చూపులు అందని దేనికోసమో కబంధునిలోకి పరకాయ ప్రవేశమైనాక కూడా చేరువవని నిర్వేదపు కసి ...

అక్షర భావనలెన్నింటినో కురుంజి[2]లపై ముద్రించి సుతిమెత్తగా నాకు చేరవేసాక మల్లె – సంపెంగలు లేవని ముఖాన్ని ముకుళితం చేసి దూషణలను జోడించి తిప్పి వంపుతూ కళ్ళు తెరవకుండానే గుండెని తడమకుండానే చేయి విదిల్చి దూరం దూరం దూరమైన నా అతితనం...

నా అతితనానికి నా నుండి నడిచి, పరిగెత్తి, ఎగిరిపోయి ఒంటిస్తంభం మేడలో ఇమిడిపోయాక హఠాత్తుగా తలుపుతట్టిన Valentine[3]ని బిగియారా కౌగిలించుకుని అదే ఉద్విగ్నతలో టెలీఫోనై, కొత్త చీరై నా ఎదుటవాలి చుంబనాల కొద్దీ అంబరాలుగా ప్రేమనంతా వర్షింపచేసి నీ మోహాన్నంతా నా దోసిళ్ళలోకి పొర్లించి మునివేళ్ళ తాడనతో గుప్పెడు స్పర్శల వీడ్కోలవుతావు నువ్వు కాస్తా శూన్యమయిన నిశ్శబ్ద సెలయేరులో దాహార్తినై తలవంచి ఒక్కగుటక వేసాక జ్ఞాపకాల ఉప్పదనం గొంతుకడ్డం పడిన ఉక్కిరిబిక్కిరిలో పూరించాల్సిన ఖాళీలేవో ఒకటొకటే స్ఫురణకొచ్చి చేష్టలుడిగిన వాసవ సజ్జిక[4]నై నిరీక్షణల్ని నేత్రపాత్రలతో కొలుస్తూ ఎంతకీ నిండని నిన్ను కన్నీళ్ళతో నింపుతాను.

---

1. *అస్తిత్వానికి Martin Heidegger ప్రయోగించిన German భాషా పదం*
2. *హిమాలయాలలో పుష్కరానికోసారి పూసే అపురూప పుష్పం*
3. *ప్రేమికుల దినం*
4. *అష్టవిధ శృంగార నాయికలలో నిరీక్షణకు ప్రతీక*



ఇక్కడ ఒంటరి దీవి మారుమూలన ఏకాంత చెట్టుకి విచ్చుకున్న ఏకాకి ఆకుల నీడల కింద కాలుమీద కాలేసుకున్న అలజడినై జ్ఞానేంద్రియాలన్నింటినీ సుషుప్తిలోకి గిరాటేసి ఏ ఆత్మీయ పిలుపుకోసమో చెవులను మాత్రమే జాగృతపరచిన ఆఖరి నిమిషపు జాగరణనై, విరహాన్నై, స్తబ్దగుసగుసల నిర్లిప్త స్మృతినై, అసంపూర్ణ పద్యాన్నై...

పంచప్రాణాలనూ ఉగ్గపట్టుకుని 'రతీ', Venus, Aphrodite[5] 'ఎందుకింత నిర్దయ' అని గొణుక్కున్న వెక్కిళ్ళ స్వరాలాపననై...

***(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 20 మే, 1996)***

5. భారత, గ్రీసు, రోమన్‌ల ప్రేమ / శృంగార దేవతలు



# 30 ఒంటరీకరణ

ఛ ... ఇక ఏముందిక్కడ
నువు కూడా మినహాయింపు కాకపోయాక !

* * *

ప్రాచీన ఏకాకిత్వం జన్యువులు
ఇంకా నన్ను వదల్లేదేమో
ఉన్నట్టుండి కణకణాన్ని ఆవహించాయిపుడు
మీ అందరి మధ్యా
నిలబడి నడుస్తూనే
భుజం చరిచి కరచాలనం చేస్తూనే
ద్విముఖంగా లయించిన సంభాషణలు
బహుముఖంగా రువ్విన నవ్వుల జడిలో మునకలేస్తూనే
అంతర్ముఖీనమై Soliloquy ల పరంపరనౌతాను
క్షితిజ – లంబాల్లో బారులు తీరిన గదుల నడుమ
ఎన్నాళ్ళకీ వేరుకాలేని నా గది నిస్సహాయత లోంచి
పై కప్పు మూలల్లోని నిర్లక్షిత సాలె గూడు దారాల గుండా
వలసకు కూత వేస్తాను

నా కలల కన్నా, Jung
Archetypical గా ఆలోచించడానికిదే సమయం
సామూహిక అచేతన అంకగణితంలో

'ఒకటి' ఆరంభమనేది మరిచావేమో
ఒక్కసారి వెనక్కి తిరుగు,

ఒకటి ...
కప్పి పెట్టలేని శవం కదా
Gregarious సహజాత సీతాకోక చిలుకకి
మున్ముందరి ప్యూపా కదా
Primate లతోనే ఆగిపోవాల్సిన పనిలేదు
అమీబా వరకు గతంలోకి ప్రస్థానించాలి!
ఒకటిలోని బహుళత Instinctual అని తేలడానికి

ఇప్పుడిక ఇక్కడే నిలబడి మాట్లాడదాం
నేను కాస్తా పరాయీకరించబడ్డాకే కదా
నేనును నీ అద్దంలో చూసుకోవడం అలవాటయింది
ప్రతి కదలికకీ నీ LitmusTest అవసరమయింది
నీ కళ్ళలోంచే ప్రపంచ సాక్షాత్కారాన్ని
నీ మస్తిష్కంలోంచే ఆలోచనాంతరంగాన్ని
వీక్షించడం తప్పనిసరయింది

అన్నీ ప్రయోజనం Scale పై
కొలమానికలుగా ముద్రపడ్డ తర్వాత
అన్నీ లాభం Platformపై
పెదాల పదనిసలు పలుకుతున్న తర్వాత
చిటారు కొమ్మపై





అపుడే తలవిదిల్చిన పచ్చనాకులా తెల్లబోయి
అంతిమ ఏకాంతంలో కూరుకుపోయి
విశ్వరూపమెత్తిన ఒంటరితనాన్నే అవుతాను!

* * *

ఒంటరితనం–
ఒక వేసవి మధ్యాహ్నపు ఎండ తీక్షణత!
శరద్రాత్రి కొబ్బరాకుల సందుల్లోని వెన్నెల తడబాటు!
సాయంత్రపు సముద్రంపై మెరుపులద్దే కిరణాల బెంగ!
కోత కాలం తర్వాతి పొలాల శూన్యత!
విరిగిపడ్డ కొండ చరియల నిర్లిప్తత!
వీధులన్నింటినీ కప్పేసిన పొగమంచు మంద్రస్వరం!
ఏ అల్పపీడనానికో బావురుమని ఏడ్చేసిన మేఘం!

నిజం .. ఒంటరితనం
ఒక ఘనీభవించిన విషాదం !

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక* ***21*** *జూన్* ***1996****)*

# 31 దుఃఖానంద సందర్భం

కిల కిలలగొంతు కాస్తా పూడుకుపోయాక
ఎగసిపడే చెంప నేలపై
కన్నీటి పూలు జారిపడ్డాయ్!

ఇప్పుడిక జ్ఞాపకం కిరణాల గుండా
VIBGYOR విక్షేపణం
విరహ వర్ణాలనే ఒలికిస్తుంది
పెళుసు దేరిన దిగుడు బావి గుండె
విషాదాల చెలమే అవుతుంది
చేద బొక్కెన నిండా తడి ఇంకిన గులకరాళ్ళు
సంపూర్ణాంతర పరావర్తనమౌతాయి
శూన్య మైదానోపరితలంపై దొర్లిన నేత్రాలు
Nostalgic వీక్షణాల మైలురాళ్ళవుతాయి
ఆలస్యంగా చేరిన ఉత్తరంలో
అక్షరాలన్నీ అదృశ్యమౌతాయ్
మనసు పెరట్లోని
గతం అంట్లపై కాకి ఆనవాలు ఎంతకీ దొరకదు!

మువ్వలూ లేని కేరింతల విరుపులూ లేని
నిర్జన వీధిలో
పోగొట్టుకున్న స్మృతి చిత్రాల ఛాయలకై
అన్వేషణ మొదలవుతుంది





వెన్నెలా లేని, వేసవి రాత్రులూ లేని అఋతువులో
నిక్షిప్తమైన చెట్టాపట్టాల జాడలకై
వెదుకులాట ఊపందుకుంటుంది
చిరంతన వేదన నిరంతరతకు
మస్తిష్కం ఆహ్వానం పలుకుతుంది!

వేనవేల మనో మథనాల అనంతరం
దుఃఖానంద సందర్భమొకటి
ఆలోచనా తీరంలో ప్రత్యక్షమవుతుంది!

ఎక్కడి కోకిలో
ఇక్కడి వసంతాన్ని బహిష్కరిస్తుంది!

అదుఃఖంగా...
నిరానందంగా...

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 30 ఏప్రిల్ 1999)*

# 32 Duet

ఇవన్నీ యుగాలుగా నాకు తెలిసిన వాక్యాలే
నువ్వొచ్చాక
పదాలన్నీ 'హోలీ' ఆడి కొత్తరంగులను అద్దుకున్నాయి
అక్షరాలన్నీ 'బతుకమ్మ'లై పూలసింగిడిని దిద్దుకున్నాయి

క్షణం క్రితందాకా
Agonyల Huang He నని వెల్లువ తరుముకొచ్చి
కన్నీటి చారికలు ముఖపొలంపై నాగేటిసాలులా దున్నేసి
గుండె గోడలను నఖక్షతించి
మనస్సు పొరలను దంత క్షతించాక
Ecstasyల Danube ప్రవాహం కాస్తా
Dead Sea లో నిమజ్జనించాక...
నీ పాట పైటలా వచ్చి నన్ను కమ్మేసింది!
Darjeeling మంచు కొండల సానువులోంచి
Darling గీతం గాలిలో తేలి వచ్చింది..!

ఇపుడిది ఒంటరితనం –
రెండు గొంతులు – ఒకే స్వరం
రెండు వాక్యాలు – ఒకే భావం
యుగళ గీతం – ఏకరాగార్చనం!
నాలుగు కాళ్ళు – ఒకే నడక....





కాలివేళ్ళు సైతం సంభాషించుకుని
చేతులు పలకరించుకుని
పెదాలు సైగలు చేసుకున్నాక
Unconscious zone లోని ఆకాంక్షలేవో
చూపుల కౌగిలింతలలో కరిగిపోయాక
నీలోని శూన్యతలోకి నేను సరసరా దూసుకువెళ్ళి
యుగాల ఖాళీని పూరించాక
ఎక్కడి నుంచో శంఖునాదం వినిపించాక...

యుగానంతరం
అస్తిత్వం మొగ్గతొడుగుతుంది
అనురాగం నుంచి విడివడ్డ రాగం
నవస్వరాన్ని ఆలపిస్తుంది...

ఇక ఏకాకిత్వమే-
Solo గీతాలాపనే...

Duet, Solo లని ఎన్ని చెప్పినా
ఈ క్షణానికి కణకణంలో ప్రతిధ్వనిస్తున్నదొక్కటే -

*నిశ్శబ్దమే గొప్ప సంగీతం!*

***(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 17 ఏప్రిల్ 2000 సంచికలో ప్రచురితం)***

# 33 నాలుగు లోకాలు



**1. Prologue**

పచ్చదనం – సెలయేరు – వెన్నెల
తప్పటడుగుల తారంగాలు
ముఖం నిండా సంభ్రమాశ్చర్యాల జిలుగులు
హద్దులుగా భూమీ ఆకాశం
తోడుగా ఒక్క అమ్మ!

**2. Monologue**

ఆలోచన – అక్షరం – అనుభవం
ప్రపంచాన్ని గుప్పిట్లోకి ఇమడ్చాలనే వెర్రి కాంక్ష
నీలిమబ్బు స్వప్నాల్లో ఈదులాట
వెల్లువెత్తిన వయసు జలపాతంలో ఒంటరి పాట
నేను –
సమూహంలో పారేసుకున్న Identity!

**3. Dialogue**

చిర్నవ్వుతో నువ్వు
పరవశించిన ప్రకృతి
'జీవన్ సె భరీ తేరీ ఆంఖే' సాక్షిగా
'నామ్ గుమ్ జాయేగా' పదాల్లోకి గమనం
నిజం ... 'నూర్ ఆగయా హై'
లోకాన్నంతా ఆవరించిన ప్రేమమంచు
నన్ను అసాంతం కమ్మేసిన నువ్వు



ఏ జన్మలోనో నెరవేరని స్వప్నం
సమ్‌భాషణల్లో వేలికి చిక్కాక
ద్వంద్వతలోని అసంపూర్ణత
అద్వైత వర్షంలో తడిసి ముద్దై మొగ్గై పరిమళమైనాక ...

**4. Epilogue**

నీ రాహిత్యం –
పాట ఆగిపోయింది

మసక బారిన వెలుగు –
వాన వెలిసిపోయింది

కరిగిన మంచు –
వెన్నెల మాయమయింది

మనసులోకి చొరబడిన శూన్యం –
స్వగతం మిగిలింది

రాలిన పూలు –
చిర్నవ్వు విషాదమయింది

గుండె నిండె జ్ఞాపకాలు ... కన్నీళ్ళు!

ప్రయాణం ఇంకా ఉంది!

*(ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం 25 ఫిబ్రవరి 2001)*

# 34 అయినా...!

*"The saddest event in the life is, not Death. But the LOVELESSNESS"*

అనంతకాలం నుండి
ఎదుర్చూపులనే ఒంటినిండా కప్పుకున్నా
క్షణకాలం దిగంబరుణ్ణే అవుతాను
గడపలోకి నడిచొచ్చిన పాదముద్రలను చూసి
వెలిసి మసిబారిన స్మృతి చిత్రాలకు
Restoration మొదలెడతాను!

నీకోసం నా గతుకు రోడ్ల ప్రయాణం
లోయలోకి జారిజారి
కూడలిలో ఏ దిక్కో జారగిలబడిన వైనం గుర్తొస్తుంది
ఏ కంటి కొసలో వదిలిన తిరస్కార బాణం
ఎక్కడెక్కడో ఎన్నెన్ని సార్లో
గుచ్చి గుచ్చి చేసిన గాయం జ్ఞాపకమొస్తుంది!

* * *

వీక్షణలోనే క్షణాలన్నీ సాగి సాగి కన్నీళ్ళలోకి తర్జుమా ఐ చీకటి కౌగిట వెర్రిగా స్వగతాలు పలికి కెలికి నిశ్శబ్ద శబ్దాల నావలకు మౌన సముద్రం నడుమున అర్థాంతరంగా లంగరేసి తీరాన్ని మరిచిన గవేషకుడి గుండెల్లోకి





దిగుమతై మెట్లుమెట్లుగా కుంగుతున్న సూరీడి నిస్సహాయతలోకి నిర్‌బలంగా మునకేసి తలనిండా అ[్రేమలను మొగ్గలేయించినాక అక్షరాలు అక్షరాలుగా బాధని మెలిపెట్టుకుంటూ ఆత్మని మొత్తంగా ఒలిచేసి అంచు అంచునా నీ రూపాన్ని ఒంటి వేలితో తడుముతూ  సందోహ దేహ సందేహ దాహంతో నీ ఉనికిని వల్లె వేసుకుంటూ ... SETI* సందేశాలను అంతరిక్షంలోకి అంతర్ అక్షంలోకి నిరంతరాయంగా ఎగజిమ్ముతూ ... వెదజల్లుతూ ...

* * *

జ్ఞాపకం
ఒక కదిలే గాయం!

ప్రేమరాహిత్యం
మహావిషాదం!!

అక్షరం
ఒక సాంత్వన!!!

***(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 20 ఆగస్టు, 2001)***

*SETI * Search for the Extra Terrestrial Intelligence.*
*గ్రహాంతరాలలో మానవుల వంటి బుద్ధి జీవుల ఉనికి గురించిన శాస్త్రీయ పరిశోధనలు*

# 35 దిగులు

1. దూరాలకు అతీతంగా
పెదాలను పెనవేసినపుడు తెలీదు
పదాలు పెదాల్లోనే పుడతాయని!

దారి చివరి చెట్టు నుండి
నేలపై పడి చిట్లిన అల్లనేరేడు పండు
కొండగాలి తాకిడికి రాలిన పూమొగ్గ
ఎక్కడి చప్పట్లకో ఎక్కడో ప్రతిధ్వనించిన గోల్కొండ
చిరిగిన పుస్తకంలో కనిపించని అక్షరం
నిండైన నగరంలో కరువైన నీటి చుక్క -
ఒక నేను!

2. దిగులు -
నన్ను నిలువెల్లా కమ్మేసిన నా సహచరి!

ఇల్లు గుర్తొచ్చి
ఇంటి చుట్టూ అల్లుకున్న మల్లెల సౌరభాలు గుర్తొచ్చి
గదిలోని ప్రతిచోటా
నీ పాదస్పర్శలు స్ఫురణకొచ్చి
మనిద్దరం
గోడలోకి మమేకమైన క్షణం జ్ఞాపకమొచ్చి





మనోదేహం – దైహిక మనస్సు
దిగులు దిగులుగా
దిగులు దుప్పటి కప్పుకుంటాయ్!

3. తలుపు దగ్గర బుజ్జగింపులు
వేపచెట్టు కింద గాఢాలింగనాలు
ఏకాంత సమయాన చుంబనాల లాలనలు
ఒకటొకటిగా మదిలోకొచ్చి
ఇక్కడ ఉన్న అన్నింటినీ అదృశ్యం చేస్తాయ్
శూన్యమై, వెలితై, ఖాళీయైన గుండె
దిగులు దిగులుగా
దిగులు నదిలో మునకేస్తుంది

చేతి మీదుగా బాస చేసినపుడు తెలీదు
పద్యాలైనా – ప్రేమలైనా
వ్రేళ్ళ సందుల్లోంచే మొగ్గ తొడుగుతాయని !

***(ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం 13 జనవరి 2002)***



# 36 మంచు జ్ఞాపకం!

ఆకాశం గూడులో
చుక్కలు పొదిగిన చల్లదనం
ఇక్కడి గడ్డిపరకపై మంచు ముత్యమై వాలింది
రాత్రి ఒడిలో స్వప్నిస్తున్న తంగేడు పూవు
ఉలికిపాటుతో ముడుచుకుపోయి మాగన్నుగా చూసింది
బార్లా చాపుకున్న తార్రోడ్డు
ఒక్కుదుట్న బిగదీసుకుని మెలితిరిగింది
గాలిలోకి తలదూసిన చెట్టు
ముకుళితమై తనువంతా ఆకులను కప్పేసుకుంది
నిలబడే నిద్దరోతున్న పిట్ట ఒకటి
ఏ పురాతన జ్ఞాపక స్మరణలోనో
రెక్కలను దగ్గరకు లాక్కుంది
మెత్తని మంచు బాహువులు-
కొలను - తామర - కలువబాల
ఒడ్డు - రెల్లుపొద- మల్లెతీగ
అన్నీ గాఢ పరిష్వంగ సౌందర్యంలో
మునకలేశాయి!

ఇక్కడి దృశ్యమంతా
మంచు పరదాల మాటున చిత్తరువే అయింది
ఇపుడు ఈ మైదానమంతటా



శీతల పవనాల కచేరీ సాగుతోంది
శృతి కలిపిన కొండలు
చలిరాగం పాడుతూ సెలయేరు
బహుగళాల జుగల్‌బందీగా విరిసిన
పొగమంచు గానం
భూగోళమంతటినీ కౌగిలించుకుంది!

నేల దుప్పటి నలుచెరగులా
తుహిన సంగీతం అద్దకాలను స్పృశిస్తుంటానా
దిగంతాలలో అనూహ్యంగా
ప్రస్ఫుటించిన
Ozone ఛిద్రాల పారదర్శకత
భయోద్విగ్న పల్లవులను రాజేస్తూంటూంది!

ఇది ఒక చేతనాచేతనాతిచేతనావస్థ–
తంబురను కాలిదన్నిన త్యాగయ్య
ధిక్కార స్వరంలోనిదేమో!

ఇది ఒక మెలుకువరహిత స్థితి –
కమాన్‌ను విరిచేసిన Beethoven
తెంపరితనంలోనిదేమో!

❊ ❊ ❊

చక్రీయ గమనాల సుదీర్ఘ ప్రస్థానాల మధ్య
వీరవిహారం చేసిన మంచు



ఈ క్షణానికి ఆఖర్న –
మేలి ముసుగులోంచి
Rebecca* చెక్కిలిని ముద్దాడింది!

మేలిముసుగై, తెల్లమేఘమై, నీలి ఆకాశమై
ఎర్రని సూరీడై, చిక్కని చీకటై, నల్లని వర్షమై
పొగ మంచై, మేలి ముసుగై
Rebecca చెక్కిలై ...

*('పత్రిక' మన మాసపత్రిక జూన్ 2002 సంచికలో ప్రచురితం)*

* ***Rebecca'*** *– ఇటాలియన్ శిల్పి బెంజోనీ 1876లో చెక్కిన శిల్పం*



# 37 ఏడు వియోగ వీక్షణాలు

1. నల్లని ఆకాశం –  
రాత్రంతా బోసిపోయే ఉంది  
చంద్రున్ని నీకు పానుపుగా చేసి!

2. కలల్లో నువ్వు –  
వెన్నెల వెల్లువ  
అమవస నిశీధి  
ఎంత ఒడిసిపట్టుకున్నా జారిపోతోంది!

3. ప్రాత: సమయాన్నే సూరీడు –  
బావురుమని ఏడుస్తాడు  
తామరపూవు కనిపించక!

4. తల దువ్వుకుంటుంటూ –  
నీ జ్ఞాపకాలే  
అద్దంలోని నా ముఖం నిండా!

5. గది అంతటా పుస్తకాలు –  
ఏదో వెలితి  
అక్షరాలన్నీ చేతులెత్తేసాయ్!

6. అవిరామ కాలఝురి –
ఎంత వెదికినా చేపలు దొరకవు
నీకై ఆలోచనలునూ!

7. రోడ్డువారగా బాటసారి
దిగాలుగా కూర్చునుంటాడు
'కభీ ముజ్‌కో యాద్ కర్‌కె
జో బహేంగే తేరే ఆంసూ' పాడుతూ ....!

*(ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం, 28 జూలై, 2002)*





# 38 మెలకువ స్వప్నం

తొలి వేకువజాము స్వప్నం-
కవ్వింతగా చూస్తూ
పరిహాసంగా నవ్వుతూ
చేతులు చాచి పిలుస్తూ
ప్రేమగా హత్తుకుంటూ
చిరుముద్దుల ముద్రలను చెంపలపై లిఖిస్తూ
ఏ లోకాల తీరాల వెంటో తీస్కెళ్తుంటావు
వెచ్చని శ్వాస-వెన్నెల మరకలు
ఇంద్రచాపమైన దేహం!
మలి వేకువజాము మెలుకువ-
చేతికి, కంటికి, స్పర్శకి, చూపుకి
అందనంత దూరంలో నువ్వు
భారమైన గుండె
దీర్ఘ నిట్టూర్పులోకి
నిర్జీవ నిశ్వాసలోకి పరావర్తనం చెంది
కన్నీరై కలవరపడ్తుంది!

ఏం మాయ చేసావో-
నీ విరహం
ఇంతలేసి నిర్లిప్తంగా
గుండెకోతగా ఉంది...!

***(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 15 ఆగస్టు, 2002)***



# 39 Solo

చేతి(వేళ్ళ సందుల్లోంచి దూసుకొచ్చిన ఉదయం
పరుగు నడకల చితులను రాజేసి
ఒక్కసారి వెనుదిరిగి చూసిన క్షణాన
Agonyల వెల్లువై తరుముకొచ్చి
హృదయాల్ని కమ్మేసాక ...

అలుపెరగని ప్రస్థానం మధ్య
కాఫీ కప్పులో ఎగసిన సంభాషణల అల
నవ్వులను, కరచాలనాలను మోసుకొచ్చి
చివరి Sip తర్వాతి ఖాళీ కప్పు
శూన్యతలోకి ఒదిగిపోయి
మదినిండా వేదనల గురుతులనే ముద్రించాక ...

కన్రెప్పల పైకి భారంగా దిగుమతైన రాత్రి
వెన్నెల్లోంచి కన్నీటి బిందువులను వెలికిలాగి
గడ్డిపరకల దేహాలపై చినుకులుగా కురిసి
వైరాగ్యం తలకెక్కిన గడ్డి పూవొకదాన్ని
అయత్నంగా తలవాల్చేలా చేసాక ...

మస్తిష్కంలో దాగుడుమూతలాడ్తున్న కల
సుప్త చేతనాలింగనంలో పరవశమై
ఇసుక దిబ్బల కొనకొసల్లో కూరుకుపోతూ



అంతర్బహిర్గతంగా ... బహిరంతర్గతంగా చలించి
ఒయాసిస్సులన్నీ ఇగిరిపోయిన
మృగతృష్ణల్లోకి పేరుకుపోయాక ...

ఒంటరితనమే-
బీటలు వారిన నేలపైని విచార ఖండిక
ఉప్పొంగిన కెరటాలలోని విషాద వీచిక
మసకేసిన మబ్బులలోని దుఃఖిత పవనం
గుండె నుండి గొంతుదాకా పల్లవించే
నిశ్శబ్ద సంగీతాల మౌన కచేరి
నిర్‌సవ్వడిగా, నిరామయంగా
ఎప్పటికీ నాలో, లో, లో, లో, లోనే ....

అనూహ్యంగా
అప్పుడు నువ్వొస్తావ్
అహ్లాదపు మెరుపు తీగెల జిలుగులతో
ఆనంద స్పర్శల తరంగాలతో
ఆత్మీయ చుంబనల జల్లులతో
నాలో, లో, లో, లో, లో, లోకే ...

డ్యూయెట్ మొదలు -
ఇక !

*(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 19 ఆగస్టు, 2002 సంచికలో ప్రచురితం)*

# 40 అదు:ఖం

లోకమంతటా చీకట్లు ఆవరించిన వేళ
వెలుగు రేఖవై వస్తావు
కొత్త ఆశలను ప్రోది చేస్తావు

హృదయమంతటా విషాద మేఘాలు కమ్ముకున్న వేళ
చిర్నవ్వుల మెరుపువై పలకరిస్తావు
ముఖంపై ఆనందాలను విరబూయిస్తావు

ఎదలోతుల్లో కన్నీటి చెలమలు ఊరుతున్న వేళ
సంతోష జలధులను ప్రవహింపచేస్తావు
పెదాలపై హర్షాతిశయాలను వర్షింపజేస్తావు

దేహమంతటా కాంక్ష విప్పారిన వేళ
మందాకినివై సరస గంగలో ఓలలాడిస్తావు
సత్యభామవై స్వర్గాన్ని సాక్షాత్కరింపజేస్తావు





నేను కాస్తా శూన్యమైన వేళ
మధుర స్మృతివై,
వెచ్చని స్పర్శవై
ప్రవహించే జ్ఞాపకానివై,
నిరంతర స్ఫూర్తివై నిండిపోతావు

నేనే నువ్వు అయిన వేళ
ప్రేమగా, ఆత్మీయంగా
నీలోని అమ్మాయితనానికి – అమ్మతనానికి
తలవంచి అభివాదం చేస్తాను
కన్నీటి చుక్కనై కాలిపై ముద్దిడుతాను...!

*(ఆదివారం "ఆంధ్రభూమి" 15 డిసెంబర్, 2002)*

# 41 డజను వీక్షణాలు



1. విచ్చుకున్న కళ్ళు
ఎదురుగా నువ్వు
మూసినా తెరిచినట్లే!

2. ఒక నువ్వు - ఒక నేను
గుడి, మసీదు, చర్చి, స్మశానం
అంతటా ప్రేమ పరిమళం!

3. ఇరు మనసులు
ఎగిసిన సునామీలు
దేహ తీరాన కెరటాల తాడన
వేలి కొసలతో మొదలైన సంభాషణ!

4. రాలిన చినుకు
నిశ్చల తటాకం
బుగ్గపై ముద్దు వాలింది
తనువు మంచు ముద్ద
జలదరించింది!

5. నుదుటి పిలుపు మెడదాకా
స్పర్శా ప్రస్థానం
రెండు కొండలు
లోయలో దారితప్పిన యాత్రికుడు!



6. పెదాల అద్దకాలు
నడుము Canvass
నాల్క కంచె
నాభిలో మునక!

7. అనాచ్ఛాదితం
మబ్బులపై మరో ప్రపంచాన్వేషణం
రెండు నిండు చంద్రుళ్ళు
గ్రహణంతో అదృశ్యం!

8. ఉచ్ఛ్వాసాల పారాణి
తెల్లని పాదద్వయం
ముకుళితమై ఎర్రబారిన పుష్పాలు!

9. వాలిపోయిన వృక్షాలు
కలవరించిన వనం
అడ్డదిడ్డంగా బాలుని పరుగు!

10. తన్మన్మయమైన తల
తెరచిన తలుపులు
గృహ ప్రవేశం!

11. మొలుచుకొచ్చిన రెక్కలు
నింగీ నేలల అభావం
సంలీనమైన దిక్కులు
ఆది మధ్యాంత రాహిత్యం!

12. ఎగిరిన జెండా
కాలస్థలాల ఓటమి
చలనం రెపరెపలు!

***(ఆంధ్రభూమి ఆదివారం 05 జనవరి 2003)***



# 42 Nothingness

ఇక్కడ ఇప్పుడేమీ లేదు
ఇంతకాలంగా ఏదో ఉందనుకున్న
Deja Vu Experience కూడా!

* * *

కలల్ని, కన్నీళ్ళని, కాసిన్ని చుంబనాలని
వేకువని, వెన్నెలని, గుప్పెడు వానచినుకుల్ని
వెర్రిగా ప్రేమిస్తూ
Accept the life as it comes స్వయం సంతృప్తుల్ని
అనుక్షణం స్వగతంలో పునశ్చరిస్తూ ...

'ఆజ్ ఫిర్ జీనేకీ తమన్నా'–
నీ కళ్ళలోకి చూసి
నీలోకి పయనించడాన్ని మొదలెట్టిన లిప్త!

'కల్ ఖేల్ మే హమ్ హో నహో'–
నీ చంచలిత పైయ్యెదల లాలనలోని
బహుముఖీనతని దర్శించిన క్షణం!
నీలాకాశం వెక్కిరింతల్ని
మట్టినేల హెచ్చరికల్ని విస్మరించేంతటి magic
అనబద్ధంగానూ, అసంబద్ధంగానూ Hijack అయిన logic



ఏక కాలంలో నేను
వీక్షకుణ్ని – నిర్వర్తకుణ్ని
నిర్లిప్తుడ్ని – నిత్య చైతన్యమూర్తిని
అశ్రువుని – అవాంఛిత ఆనంద హేతువుని!

'క్యా హాల్ హై – క్యా దిఖా రహే హో' …
Absurd ప్రశ్న ఒక్కటి
ముఖాన్ని అతుక్కుని వ్రేలాడుతూ ఉంటుంది!

'కహీ న కహీ ఖోగయే హమ్' –
రా … రమ్మనే చూపుల్లో
మడతపడ్డ పెదవిపై పంటి నొక్కుల్లో
బాహుమూలాల్లో, నడుము వొంపుల్లో
జఘన గగనంలో, ఊరువుల లోయల్లో
ఎక్కడో … చిట్టచివరగా
నీ గుండెలో నా చోటును వెతికే అన్వేషణలో ….

❊ ❊ ❊

Something is in Something
Something is in Everything
Something is in Nothing
But everything is in Nothing

ఎప్పుడూ ఇక్కడ ఏమీ లేదు
ఇంతకాలంగా ఏదో ఉందనుకున్న
అనుభవ జ్ఞానం కూడా ….!

***(ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' 17 ఫిబ్రవరి 2003)***

# 43 ఒంటరి సముద్రం



నువ్వు నా కోసమే ఉన్నావు!

ఇంద్ర ధనుస్సు వారధిగా
మేఘమాలల చిత్ర విచిత్ర బాసలతో
వేసవి వెన్నెలల ఆత్మీయ స్పర్శలతో
నువ్వు నా కోసమే ఇటు వచ్చావు
'తుఝే జమీ పె బులాయా గయా హై మేరే లియే'!

ఎన్ని వేనవేల ఆకాంక్షల సాకారమో కదా –
ఒక నువ్వు!
ఎన్నాళ్లుగానో నన్ను కవ్విస్తున్న
నీలాకాశానివి కదా–
ఒక్క నువ్వు!

* * *

ఇప్పుడు మనో సముద్రం పొంగింది
చినుకై, వాగై, వరదై, నదియై, సాగరమై
కెరటమై, కెరటంపై అద్దిన వెండి నురుగుల తళుకై ...

నీలాకాశం అందిన వెర్రి ఆనందంలో
హృదయ సాగరం అలలు అలలుగా ఎగిసింది
సాగరానికి – నింగికీ మధ్య అభేదత పల్లవించింది



ద్వంద్వత తాలూకు యుగాలనాటి విషాదం
తీరంపైని ఇసుక రేణువుల్లో శిథిలమయ్యింది
ఎగిసిపడ్డ మహదానందాల కెరటం
చేరువైన ఇసుకను తడిమేసి, తడిచేసి
తబ్బిబ్బులతో స్నానం చేయించింది
కలలన్నీ ఏకోన్ముఖమై
ఇసుక గూడై, గూడులో దీపమై
దీపం చుట్టూ వెలుగులై, వెలుగులో నీ చిర్నవ్వు కిరణమై
రాత్రి నీ ముఖ ఆకాశంపై
సంతోషపు నక్షత్రాల్ని పూయించాయి!

ఇప్పుడు నువ్వున్నావు–
ఇసుకలో, చినుకులో, హరివిల్లులో
పడమటి పవనంలో, కెరటాల నురుగులో
మబ్బు తరగలో ...
నాలో ...!

* * *

నిశిరాత్రి కలతనిద్ర
కలలో నా Valentineగా సాక్షాత్కరిస్తావు
తమకంగా హత్తుకుందామని పక్కకి ఒత్తిగిల్లుతాను
శూన్యాన్ని కౌగిలించుకుని మెలుకువలోకొస్తాను

నువ్వు లేవు
నువ్వు ఉన్నావు
నువ్వు లేనట్టే ఉన్నావు!
నువ్వు ఉన్నట్టే లేవు!!

మదిలో దుఃఖ కెరటాలు
కంటి తీరాలపై అశ్రువులుగా వర్షిస్తాయి
ఇసుక రేణువుల్లో యుగాల నాటి విషాదం
మళ్ళీ జీవం పోసుకుంటుంది!

* * *

సముద్రం
మరొక్కసారి ఒంటరి అయ్యింది
*చల్ అఖేలా ... చల్ అఖేలా ...*

***(ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం 09 మార్చి 2003)***





# 44 అన్యమనస్కకో అప్రేమ గీతం

అనివార్యంగా
నిన్ను అర్థం చేస్కునే ప్రయత్నంలో
ప్రేమించడాన్ని నేను కొత్తగా కనుగొన్నాను!

* * *

అక్షరంగా మొదలైన నువ్వు
ఇపుడు –
నిలువెత్తు 'హా'శ్చర్యంగా గుండెలో ఒదిగిపోయావు
నడిచే అద్భుతంగా మదిలో విశ్రమించావు
Fullstop లేని అవిశ్రాంత ప్రేమమూర్తిగా అవతరించావు
సమాధానమే దొరకని ప్రశ్నార్థకమై మిగిలిపోయావు!

సహజ అన్యమనస్కవై
ఒకచో వరూధినివై
మరొకచో మధురవాణివై
ఇంకొకచో లాలసవై
మొత్తంగా నువ్వై
ఏ ప్రేమలోకీ మమేకం గాకుండా
ఏ అనురాగ హస్తంలోనూ సాంత్వన పొందకుండా
ఏ కాంక్షా దేహ స్పర్శలోనూ సంపూర్ణతను ఆవహించకుండా
నిరంతర ప్రేమికవై
నిరపేక్ష ప్రేమాన్వేషివై దేహాంతాలలో నిరీక్షిస్తున్నావు!



ఇప్పటిదాకా నీ ప్రేమలో –
నన్ను నేను విశ్వవాప్తం చేసుకున్నాను
నిన్ను మాత్రమే ఆరాధించేంతగా కుంచించుకుపోయాను
చేతనాచేతన సుప్తచేతనావస్థల్లో
నీ కవ్వింపు చూపుల వలయంలో గింగిరాలు తిరుగుతూ
నిర్ద్వందంగా నిన్నే స్మరిస్తూ
నేను యావత్తూ నీలో హరించుకుపోయాను!

కానీ, నిన్నటి వేసవి వెన్నెలలోని మల్లెల గుబాళింపులో
నేనొక చెమట బిందువైనాక
ఏక కాలంలో బహుప్రేమల వైచిత్రిని
నీ కనుసన్నలలో దర్శించాను!

ఇక ఇప్పుడు –
అసూయ–ద్వేషాలకు అతీతంగా
నిన్ను మాత్రమే కాకుండా
నీ ప్రేమల్ని కూడా ప్రేమించడం నేర్చుకోవాలి!
ప్రేమలో మోహించడాన్ని
మోహంలోని ప్రేమని అవిభాజ్యం చేసుకోవాలి!

చివరాఖరికి –
వేల ప్రేమల్లో ఒక ప్రేమని జతచేయాలి
నేనింకా ఎదగాలి !



తప్పనిసరిగానూ, స్వచ్ఛందంగానూ
నిన్ను ప్రేమించే ప్రయత్నంలో
ప్రియా,
ఇప్పుడు నిన్ను కొత్తగా అర్థం చేస్కుంటున్నాను!

***(ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం, 25 మే 2003)***

# 45 ఇంకా...

ఇపుడీ వియోగానంతర నిమిషాన
ఇంకా చెప్పాల్సినవి
ఇంకా పంచుకోవాల్సినవి
చాలా మిగిలిపోయాయేమోనన్పిస్తుంది

నిన్నటి దాకా మమేకమై ఉన్నాం
నాలో అంతటా
నీ సహజీవన ప్రవాహ ఉన్మత్తత
నీ సాహచర్యపు మోహ దాహార్తిలోని తన్మయత్వం
నీ మాటల చేష్టల చూపుల వలపులోని పరవశం
నీ కవ్వింతల తుళ్ళింతల దేహపు కలవరింత!

ఇపుడీ వియోగ క్షణాన
ఇంకా చేయాల్సినవేవో కొన్నింటిని
అనివార్యంగా Miss అయ్యాననిపిస్తోంది
తెరే మేరే సప్నే నుండి
మనసు పలికే మౌనగీతం మీదుగా
ఏక్ కమ్ జిందగానీ చేయి పుచ్చుకుని
రూప్ తెరా మస్తానాని ఆలాపిస్తూ
చౌదవీ కా చాంద్‌ని – వెన్నెలలోని వేడిమినీ ఊహిస్తూ
చందన్ స బదన్‌ని – లేత గులాబి పెదాల్ని స్పృశించి
యే క్యాహువా.. కైసే హువా సందేహాల్ని తోడు చేసుకుని
నయా దర్ద్‌నీ – నయీ ప్యార్‌నీ





అనుభవిస్తూ, అనుభూతిస్తూ
నిదురించే తోటలోని నిన్ను
దిల్ భర్.. దిల్ భర్
మసక వెల్తురులో వీక్షిస్తూ...

***

అవును, ఏ క్షణానికా క్షణం –
ఏ రోజు కారోజు కొత్తదే కదా –
మళ్లీ తిరిగిరానిదే కదా
365 చిల్మన్‌లని దాటి వచ్చాక కూడా రుజువైంది ఇదే కదా

***

అవును –
ఇపుడీ వియోగానంతర సమయాన
గొప్ప అద్భుతాన్ని Miss అయ్యాననిపిస్తోంది –
సానుభూతి ప్రేమ ఓదార్పులతో పరివ్యాప్తమై
కాంక్షాదేహపు జీవన లాలసలలో ఓలలాడి
పరిష్వంగమై, పెనవేతయై, ఇద్దరమూ గెలిచే
తీయని పోరాటమైనాక
దూది పింజయై, నీలి మేఘమై
తేలియాడిన నిశ్వాసానంతర తృప్తిని...

నా దేహాత్మను..
నా ప్రేమను
ఇంకా, నిన్ను –

*(ఆంధ్రభూమి, సాహితి, 30, జూన్, 2003)*

# సంవేదన, సందిగ్ధత, సంక్షోభ సమయాల వీక్షణ!

ఓసారి బెంగాల్‌లో మహిళలు ప్రఖ్యాత నవలా రచయిత శరత్ చంద్రగారితో ముచ్చటిస్తూ "మీరు ఎంతో బాగా రాస్తారండి. మాకు బాగా అర్థం అవుతుంది. రవీంద్రుడి రచనలు ఒక పట్టాన కొరుకుడు పడవు" అన్నారట. శరత్‌గారు నవ్వుతూ "నిజమ్! నేను మీలాంటి వారి కోసం రాస్తాను. గురుదేవులు రవీంద్రుడు నాలాంటి వారి కోసం రాస్తారు!" అంటూ ఇష్టాగోష్ఠి ముగించారట...

ఇక్కడ ఆ మాటలు గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎందుకొచ్చిందో కానీ చిక్కగా, చక్కగా, భావం, భాష, ప్రతీకలు, వస్తువు, శైలి, పదబంధాలు- విన్యాసాలు ఏవి ఎన్ని పాళ్ళలో వుండాలో అచితుచి వేస్తూ రాయటం... రాసి అందర్నీ మెప్పించడం చాలా తక్కువ మందికి చెల్లుతుంది. అలాంటి వారిలో అగ్రతాంబూలం అందుకోగల్గిన బహుముఖ ప్రజ్ఞాశాలి మామిడి హరికృష్ణ.

ఫలరాజం ఆ మామిడి అయితే కవితలరాజం ఈ మామిడి!

**సినీవిశ్లేషకుడు** గా రెండు **నంది అవార్డు**లతో పాటు **సినీ గోయెర్స్** పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. నాకు తెలిసి వరుసగా 5సార్లు జాతీయ స్థాయిలో, ఫైనల్-3కి వెళ్లిన ఉత్తమ సినీ విశ్లేషకుడు. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, హాలీవుడ్ చరిత్రలే కాదు. వరల్డ్ సినిమాల మీద సంపూర్ణ అవగాహన ఉన్న విశ్లేషకుడు!

**స్క్రిప్ట్ రైటర్** గా కన్నడ, తెలుగు, మరాఠీ భాషల్లో విపరీతమైన పాపులారిటీ సాధించి, గేమ్ షోలలో కొత్తదనాన్ని కలిగిస్తూ అందరితో **'వావ్'** ... అనిపించిన 'వావ్' గేమ్ షో రచయిత హరికృష్ణే!. **"అభిమాని", "రాజు - రాణి - జగపతి"** వంటి వాటికే కాదు. **"యువర్స్ టైమ్ స్టార్ట్స్ నౌ", "నూరేళ్ల భారతీయ సినిమా", "సూపర్ హిట్ సినిమా", "టాప్ 100 మూవీస్", "రూలర్"** లాంటి వందలాది టెలివిజన్ కార్యక్రమాలకు తానే స్క్రిప్ట్ సమకూర్చారు.

**చిత్రకారుడు**గా, **గాయకుడు**గా, **కథారచయిత**గా ప్రత్యేకతను సాధించిన సున్నిత మనస్కుడు.

**అనువాదకుడు**గా ఎన్నెన్నో కవితలను అనువదించిన హరికృష్ణ Frontline Formations లాంటి ఆంగ్ల కవితల సంపుటిలో దాదాపు 23 కవితల్ని తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువదించడమే కాక... నేషనల్ బుక్ ట్రస్ట్ వారి 'మీసం కథ' లాంటి బాలసాహిత్యాన్ని, ఆకాశవాణి, జాతీయ కవిసమ్మేళనంలో ఇతర భాషా కవితలను ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువదించారు. అంతేకాదు 2016లోనే ఖలీల్ జిబ్రాన్ రచించిన Sand & Foam ని తెలుగులోకి అనువదించారు. ఈ మధ్యకాలంలో వచ్చిన చక్కటి అనువాదంగా ఈ పుస్తకాన్ని బి.ఎస్.

రాములు గారే కాక ఎన్. గోపిగారు ఎంతగానో మెచ్చుకున్నారు. గవర్నర్ **సి. హెచ్. విద్యాసాగర్ రావు** గారు కూడా అభిమానంతో ద్వితీయ ముద్రణకు ముందుమాట రాసిచ్చారంటే అర్థం చేసుకోవాలి ఆ పుస్తకం ఎంత ప్రాశస్త్యం పొందిందో...!

**వక్తగా** సాహిత్యమైనా, పుస్తక సమీక్ష అయినా, ఆవిష్కరణలైనా, సినిమా డిస్కషన్ అయినా, ఎలాంటి సభా ప్రారంభాలైనా, శిక్షణా శిబిరాలైనా తాను ప్రసంగకర్తగా ఉంటే చాలు. ఆ సభ విజయవంతమే. అనర్గళమైన వాగ్ధాటి తాను LAWCET లో స్టేట్ టాపర్‌గా వచ్చినందుకో, పీజీ గోల్డ్ మెడల్ అయినందుకో, ప్రభుత్వంలో ఉన్నతాధికారి అయినందుకో అబ్బింది కాదు. తన విపరీతమైన పుస్తక పఠనం వల్ల ఒనగూరిందే.

హరికృష్ణలో హరి ఎంత సాదాగా ఉంటారో కృష్ణ అంత జటిలంగా ఉంటారు. హరి అంటే బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎలా అనుకున్నామో... కృష్ణలోని అంతర్ముఖాన్ని కూడా అలాగే చూడాల్సి ఉంటుంది.

ముఖ్యంగా కుటుంబం విషయంలో 'అంతర్‌లోకం' కవితలో తాను రాసుకున్నట్టు

*'ప్రతి వాడికి తనకోసం ఒక గది ఉండాలి.*
*పల్లకి ఎక్కేవాడిలోనో, మోసే వాడిలోనో*
*తనను తడుముకోవడానికి'*

అన్నట్టు తానే ఒక సైన్యంగా కుటుంబాన్ని మోసిన మనిషి.

తానో **Introvert!** ఏకాంతవాసి. తన అంతర్ముఖంలో కుటుంబం తప్ప మరేదానికీ ప్రాధాన్యత లేదు. ఒక్క అక్షరం తప్ప మరేదాన్ని దరిదాపుల్లోకి రానివ్వని అక్షరార్చకుడు. సాదాసీదాగా కనిపిస్తాడు. ఉన్నత ఆఫీసర్ అయినా ఏ హంగులు, ఆర్భాటాలు కోరుకోని వ్యక్తి. స్థాయి హంగులు, పదవి పొంగులు దరిచేరనీయకుండా ఏ పదవైనా చేతల సమాహారమేకానీ అలంకారయుతం కాకూడదని నమ్మే వ్యక్తి. ఎన్నెన్నో ఒడిదుడుకుల మధ్య జీవనయానం సాగిస్తూ 'మా అమ్మకు కొనసాగింపునేనని' ఒంటరీకరణతో సూటిగా చెప్పగలిగిన వ్యక్తి. అన్నింటికన్నా ముఖ్యంగా చిన్నపుడే చనిపోయిన అమ్మ కోసం ఎప్పుడైనా గుర్తు తెచ్చుకుని తన తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లు ఏడుస్తారేమోనని వారిని ఆదరించేందుకు, అక్కున చేర్చుకుని బుజ్జగించేందుకు తాను అమ్మా నాన్నల కలయికగా వచ్చిన 'అన్న'గానే సదా వారి సేవలో జీవితమంతా ఒంటరిగానే ఉండాలని మనసా, వాచా కర్మణా కోరుకున్న వ్యక్తి!

బావలంటే విపరీతమైన అభిమానం. చెల్లెళ్లంటే ప్రాణం – అమ్మ లేని లోటు తెలియకుండా వాళ్లకి జడలేసి, స్కూళ్లలో చేర్పించి అందరినీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు తన కష్టంతో చదివించి, మరో అమ్మగా మారిన తన జీవనం అందరికీ ఆదర్శప్రాయమే!

ఇక వాళ్ల నాన్నగారు చుట్టూ పది ఊళ్లకు ప్రాణదాత. అప్పుడెప్పుడో చదివిన ఐదేళ్ల ఆయుర్వేద విద్వాన్ జ్ఞానంతో ఎంతోమందికి ప్రాణదానం చేస్తున్న నికార్సయిన వైద్య శిరోమణి డాక్టర్ సుదర్శన్ గారు.

మా మాస్టారు నాళేశ్వరం శంకరం గారింట్లో బీరువా నిండా పుస్తకాలు దాచుకుంటారని అందరితో గొప్పగా చెప్పేదాన్ని. హరి ఇంటి నిండా పుస్తకాలు, సినిమాలు, డాక్యుమెంటరీల సీడీలు (ప్రపంచంలోని అన్ని భాషలవి) దర్శనమిస్తాయి. మార్కెట్‌లోకి విడుదల అయిన ప్రతీ మంచి పుస్తకం కూడా తన దగ్గర దొరుకుతుంది–

**సాహిత్యం తన ఉఛ్వాసం**
**సినిమా తన నిశ్వాసం**

అందరి యువకుల కలల్లోకి కత్రినాలు, శృతిహాసన్‌లు వస్తే తన కలల్లోకి డెన్మార్క్‌కు చెందిన తాత్వికుడు సోరెన్ కీర్క్‌గార్డ్, సర్రియలిస్ట్ పెయింటర్ సాల్వడార్ డాలీ, అస్తిత్వవాద దార్శనికుడు నోబెల్ ప్రైజ్‌ను తిరస్కరించిన సాహితీ శిఖరం సాత్ర్‌లు వస్తారు. జిడ్డు కృష్ణమూర్తి తత్వామృతాన్ని చవిచూపిన ఈ ఫిలాసఫర్‌ని రతి, వీనస్, ఆఫ్రోడైట్‌లు, గ్రీకు నిద్రాదేవత హిప్నోస్‌లు కూడా పలకరించి వెళ్తుండటం చిత్రమే అన్పించక మానదు.

ఇక వారి కవిత్వంలోకి వెళదాం... వారి కవిత్వం మనల్ని ఒంటరి దారుల్లోకి తీసుకెళ్తుంది. తాత్విక చర్చల ఒంటి మేడ మీద నిలబెట్టిస్తుంది.

**'జ్ఞాపకం ఒక కదిలే గాయం**
**ప్రేమరాహిత్యం మహా విషాదం**
**అక్షరం ఒక స్వాంతన'**

అంటూ అక్షరార్చనలోనే జీవితాన్ని సాగిస్తున్న ఈ కలం నుంచి కురిసిన ప్రతి కవిత ఓ ఆణిముత్యమే.

**'కోతకాలం తర్వాత పొలాల శూన్యత**
**ఏ అల్పపీడనానికో బావురుమని ఏడ్చేసిన మేఘం**

**'ఒంటరితనం ఒక ఘనీభవించిన విషాదం'** అంటూ 'ఒంటరీకరణ'ను అక్షరీకరించగలిగిన వ్యక్తి. 'సముద్రం మరొక్కసారి ఒంటరైంది' అంటూ ఇష్టంగా, ప్రేమగా, ఆర్తిగా ఒంటరితనాన్ని కౌగిలించుకుంటూ ఒంటరియానం చేస్తుంటాడు.

తన మీద వెర్రి వ్యామోహమో... విపరీతమైన ప్రేమనో కానీ తాను కలం పట్టుకుంటే పదబంధాలు అలా వచ్చి అలవోకగా చేరిపోతుంటాయి.

**'అనార్ద్ర సముద్రం' కవితలో..**

**'అవును. ఇది సముద్రమే. వేనవేన మోహాల, భోగాల, రోగాల, రుణాల మంద్రనాదమే. అయినా సెర్చ్‌లు, రీసెర్చ్‌లు ఎన్ని చేసినా ఇక్కడ ఒక్క నీటిచుక్క రాలదు. కన్నీటిచుక్క ఆవిరైపోదు'**

అంటూ హరిత హరిత వర్ణంతో బలహీనంగా ఆకులను, కొమ్మలను అయిష్టంగా కౌగిలించుకుంటాయంటారు.

పదప్రయోగాల విషయంలో కూడా తన ప్రత్యేకతలను చాటుకున్నారు.

**సామవాదాలు – సామ్యవేదాలు**

**ప్రజాస్వామ్యం – ప్రభుస్వామ్యాలు**

**పగబట్టిన - పొగబెట్టిన**
**వీక్షకున్ని - నిర్వర్తకున్ని**
**నిర్లిప్తుడ్ని - నిత్య చైతన్యమూర్తిని**
**మౌంట్ ఎవరెస్టులలో అన్ రెస్ట్**
**కామంలోనూ - క్షామంలోనూ, క్షమలోనూ - భ్రమలోనూ**
**దహనమై - దగ్ధమై, హననమై - ఖననమై**
**అత్యాశతో - అనాశతో,** కొన్ని ఉదాహరణలు.

ఇప్పటి వరకూ మన తెలుగు భాషలో లేని కొత్త పదాలను, పదబంధాలను సృష్టించడం హరికృష్ణకే చెల్లింది. "చేతనాచేతనాతిచేతనత్వం", "భౌతికాభౌతికాధిభౌతికత్వం'', దుఃఖానందం,

స్కేలీకరించడం, ఒంటరీకరణ, అప్రేమ, అదు:ఖం, నిరానందం రాత్రీకరణమైన లాంటి కొత్త పదాలు ఈ సంకలనంలో మనల్ని పలకరిస్తాయి.

ప్రేమ గురించి ఎందరో ఎన్నో రకాలుగా రాశారు. పదేపదే చెప్పారు. కానీ ఎందరు రాసినా... ఎవరెన్ని చెప్పినా... కొత్తరకంగా రాసిందే మిగిలింది. అదే గెలిచింది. హరికృష్ణ రాసినంత గొప్పగా ఎవరూ రాయలేదేమో అనిపిస్తుంది. తన ప్రేమైక ఆశలకి ప్రేమభావం అక్షరాలా అక్షర చిగుళ్లే వేయించింది.

**'నిన్ను చూడగానే నా చిగురాకు మనసు మురిసింది**
**తెలిమబ్బు హృదయం తేలిపోయింది'**

అంటుంటే తొలిప్రేమ ఇంతేకదా అనిపించక మానదు.

'అన్య మనస్కకో అప్రేమ గీతం' చాలా కొత్త ప్రయోగం. అప్రేమతో ప్రేమను తెలపడం, ఆ ప్రేయసి కూడా అన్యమనస్కి కావడం చిత్రం. **'అనివార్యంగా నిన్ను అర్థం చేసుకునే ప్రయత్నంలో ప్రేమించడాన్ని నేను కొత్తగా కనుగొన్నాను'** అంటాడు ఈ కవి.

యురేకా అని ఆర్కెమెడిస్‌లా అరవకపోయినా జీవనసత్యం ఆవిష్కృతమైందే అనిపించక మానదు.

**'నువ్వంటే నాకు ఆకాశమంత ప్రేమ - విశ్వమంత కాంక్ష**
**భూగోళమంత కోరిక - కనకాంబరమంత మోహం**
**నామనసంత ప్రేమ - నీపై నాకున్న ఈ ప్రేమే డీఎన్ఏలా నన్ను తరతరాలుగా మళ్లీ మళ్లీ అవతరించేలా చేస్తోంది'** అంటూ ప్రేమను ప్రేమ ప్రేమగా ప్రేమిస్తుంది అన్న శ్రీశ్రీని గుర్తుచేస్తాడు.

"ఎన్ని యుగాల నిరీక్షణ ఫలితమో కదా ఒక్క నువ్వు" అనటం అందరికీ సాధ్యపడదు.
ఎన్ని చెప్పినా - ఎన్ని కవితలు రాసినా
తాను ప్రేమించేది - లాలించేది - పరవశించేది - పలవరించేది
అసంపూర్ణ వాక్యాన్నే - అప్రేమనే - అన్య మనస్కనే
అచ్చంగా చెప్పాలంటే అమ్మ నేర్పిన అక్షరాన్నే ....

అందుకే కవిత్వం తన నిరంతర ప్రేమిక. సంపూర్ణతలో సంతృప్తి లేదని, ప్రేమలో పరిపూర్ణత లేదని, జ్ఞాపకంలో చేతన లేదని అనగలిగాడు కాబట్టే అమ్మకి కొనసాగింపు నేనని గర్వంగా చెప్పుకోగలిగాడు.
అమ్మని ఆకాశమంత ప్రేమించాడు. భూదేవి ఎత్తిన మానవ జన్మగా భావించాడు. అజాతమిత్రునిగా చూడగలిగాడు. అందుకే తన తొలి కవితాసంకలనం 'ఊరికి పోయిన యాళ్ళ'ను అమ్మకు అంకితమివ్వగలిగాడు.

అందరూ ఆలోచించినట్లు కొందరు ఆలోచించలేరు. అందరూ చెప్పినట్లుగా కొందరు చెప్పరు, విభిన్నంగా, వినూత్నంగా చెప్పాలనుకుంటారు. అదే హరికృష్ణ ప్రత్యేకత.

*వర్షం ఎప్పుడు హర్షమే కానక్కర్లేదు. ఒకానొక తిరస్కృత ప్రేమికుడి కన్నీటి పాట అందామా' అని మనల్ని ప్రశ్నిస్తాడు.*

**ఎన్ని వేన వేల ఆకాంక్షల సాకారమో కదా ఒక్క నువ్వు**
**ఎన్నాళ్ళుగానో నన్ను కవ్విస్తున్న నీలాకాశానివి కదా ఒక్క నువ్వు**

అనగలిగిన ప్రేమైక జీవే – *"దిగులు నన్ను నిలువెల్లా కమ్మేసిన నా సహచరి"* అంటాడు.

గ్లోబల్ ఆలోచనల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యాడు కాబట్టే గ్లోకల్ ఆపాలజీ చెప్పగలిగాడు. యాక్ట్ లోకల్ థింక్ గ్లోబల్ కాలమిది, గూగుల్ యుగంలో ఇప్పుడంతా నభూతో వార్తలే అంటూనే 'దు:ఖానంద సందర్భం' కవితలో....

**"ఎక్కడి కోకిలో ఇక్కడి వసంతాన్ని బహిష్కరిస్తుందని"** రాస్తారు.

'అనంతత్వ సాధనకోసం దాల్చిన ఆకృతి కదా ఆత్మ' అని చెపుతూ, మరోచోట "మేఘం నెమరు వేసుకుంటున్న జ్ఞాపకాల సంకలనంలా' వాన ఉంద"ని కొత్త భావ చిత్రాన్ని ఆవిష్కరిస్తాడు.

"మట్టిలోంచి నిటారైన వెన్నెముకలు" (ఆదిమ ప్రశ్న)
"నిరీక్షణాల్ని నేత్ర పాత్రలతో కొలుస్తూ
ఎంతకీ నిండని నిన్ను కన్నీళ్లతో నింపుతాను" (ఆలాపన) లాంటివి తన కవితల్లో అడుగడుగునా పలకరిస్తాయి.

కవిత్వం ఎత్తుకోవడంలోనే కొత్తదనం కనిపిస్తుంది. ముగింపులో ఒక సత్యం ఆవిష్కృతమవుతుంది.

*'నేనేదీ కానిచోట నేనేతరమైన వాళ్లు నన్ను శాసిస్తున్న, శపిస్తున్న చోట*
*సుషుప్తిలోకి, గాఢ మనోనిక్షిప్తిలోకి జారుకున్నా' అని రాసిన వ్యక్తే.*
*'దిగులు' కవితలో 'దూరాలకు అతీతంగా పెదాలను పెనవేసినపుడు తెలీదు*
*పదాలు పెదాల్లోనే పుడతాయని' అని అన్నప్పుడు*

*"ఎప్పుడూ ఇక్కడ ఏమీలేదు. ఇంతకాలంగా ఏదో ఉందనుకున్న అనుభవ జ్ఞానం కూడా"* అనటం గొప్ప తత్వంగా అన్పించకపోదు.

స్వప్నం – *"అధో జగత్తులోని ఓపెన్‌కాస్ట్‌లు, ఇంక్లైన్‌లను సాక్షాత్కరింప జేస్తుందం"*టారు. *"తేరే మేరే సప్నే నుంచి సాగి మనసు పలికే మౌనగీతం"* కవిత పాటలతో చేసిన కొత్త ప్రయోగంగా కనిపిస్తుంది.

శీర్షికలు కూడా సరికొత్తగా పలకరిస్తాయి. అన్య మనస్కకో అప్రేమగీతం, దుఖానంద సందర్భం,డజన్ వీక్షణాలు, అనార్ద్ర సముద్రం, ఒంటరీకరణ, ఫినిక్స్ మరణం, మంచు జ్ఞాపకం లాంటివి.

నాకు ఈ ప్రపంచంలో రెండింటి మీద మమత, మమకారం ఎక్కువ. ఒకటి సముద్రం, రెండు మట్టి. సముద్రానికి విత్తన భాష తెలియదు. మట్టికి పెత్తన భాష తెలియదు. ఈ రెండు కలిస్తేనే కవిత్వం. కవిత్వమంటే ఉపమానాలు, ఉపమేయాలు, అనుభవసారమో, అనుభూతుల స్పందనో అవ్వాలని లేదు. కాకపోతే రేపటి దిశా నిర్దేశాలకు కవిత్వం వాహికగా నిలవాలి. అది హరికృష్ణ కవితల్లో బాగా దృశ్యమానం అవుతుంది.

రాసే కాగితం చిన్నదే కావచ్చు. కానీ తన కవితల కాన్వాస్ మాత్రం ఎంతో పెద్దది. మరింత గొప్పది, మో, అజంతాలు చాలాకాలం నాకు అర్థం కాలేదు. అర్థం కాలేదనే దుగ్ధతోనే వారి కవితల్ని ఎక్కువసార్లు చదివాను. హరికృష్ణ కవిత్వం కూడా అంతే. భావం ఏదో తెలుస్తున్నట్టే ఉంటుంది. ఏదో మూలాలు మనం పట్టుకున్నామనే అనుకుంటాం. తీరా చూసేలోగా మనం ఎక్కడో ఉంటాం.

ఎంతో తాత్వికత మరెంతో విస్తృత అధ్యయనంలోంచి ఉబికిన ఆలోచనా సాంద్రతల మధ్య విషాదానందాల చెలియలికట్ట మీది ఏకాంత వృక్షంలా కన్పిస్తాడు. వాడిన ఉపమానాల్లో ఎంతో పరిణతి, అపరిమితమైన పరిశీలన, భాషా పటుత్వం – అన్నింటికీ మించి మానవీయ కోణం అడుగడుగునా పలకరిస్తాయి.

'సోలో' కవితలో చెప్పినట్లు

*ఒంటరితనం – బీటలు వారిన నేలపైని విచార ఖండిక*
*ఉప్పొంగిన కెరటాలలోని విషాద వీచిక*
*మసకేసిన మబ్బులలోని దు:ఖిత పవనం*
*గుండె నుంచి గొంతు దాకా పల్లవించే నిశ్శబ్ద సంగీతాల మౌనకచేరి*
*నిర్ సవ్వడిగా, నిరామయంగా ఎప్పటికీ నాలో లో లో లోనే...*

నిజంగానే హరికృష్ణ కవిత్వంలో
'దృశ్యమాన ఆత్మ
అదృశ్య దేహం", కొలువై ఉన్నాయి. అందుకే తన కవిత్వం ఒంటరీకరణమైంది. తన భావనలు సమూహంలో ఒంటరులై తనని ఒంటరీకరణలో బందీని చేశాయి.

మిత్రులారా!... ఈ ఒంటరీకరణ మిమ్మల్ని కబ్జా చేస్తుంది. మీ భావాల్ని హైజాక్ చేస్తుంది. మీ ప్రేమల్ని, మీ నమ్మకాల్ని ఏమారుస్తుంది. మొత్తంగా మిమ్మల్ని మార్చేస్తుంది. ఒక్కసారి ఈ అక్షరాలతో చేయి కలపండి. ఈ ఆలోచనలతో పాటు కదలండి. సరికొత్త భావనా ప్రపంచానికి తలుపులు తెరవండి– మిమ్మల్ని మీరు సరికొత్తగా వెతుక్కోండి. హరికృష్ణగారితో పాటు ఒంటరీకరణని మీరూ ఆస్వాదిస్తూనే వుండిపోతారు....

**– అయినంపూడి శ్రీలక్ష్మి**

*(ఇది 15 యేళ్ళ క్రితం శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు – హరికృష్ణగారి కొన్ని కవితలను చదివి రాసిన అభిప్రాయం... "రాని పుస్తకానికి రాసిన సమీక్షగా" 'పాలపిట్ట' మాసపత్రిక మే, 2019 సంచికలో ప్రచురింపబడింది)*

# కృతజ్ఞతలు...

గౌ॥ శ్రీమతి **తమిళ ఇసై సౌందర రాజన్** గారు, *గవర్నర్, తెలంగాణ రాష్ట్రం*

గౌ॥ శ్రీ **ఇఎస్ఎల్ నరసింహన్** గారు, *పూర్వ గవర్నర్, తెలంగాణ రాష్ట్రం*

గౌ॥ శ్రీ **చెన్నమనేని విద్యాసాగర్** గారు, *పూర్వ గవర్నర్, మహారాష్ట్ర*

గౌ॥ మంత్రివర్యులు – శ్రీ మహమ్మద్ మహమూద్ ఆలీ గారు, శ్రీ ఎర్రబెల్లి దయాకర్‌రావు గారు, శ్రీ కురసాల కన్నబాబు గారు.

గౌ॥ శాసన మండలి / శాసనసభ సభ్యులు – శ్రీ కడియం శ్రీహరి గారు, శ్రీ శేరి సుభాష్‌రెడ్డి గారు, శ్రీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గారు, శ్రీ కర్నె ప్రభాకర్ గారు, శ్రీమతి గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి గారు, శ్రీ దాస్యం వినయ భాస్కర్ గారు, శ్రీ రసమయి బాలకిషన్ గారు.

గౌ॥ శాసన మండలి పూర్వ ఛైర్మన్ శ్రీ స్వామిగౌడ్ గారు, గౌ॥ శాసన సభ పూర్వ సభాపతి శ్రీ మధుసూదనచారి గారు, మాజీ మంత్రివర్యులు శ్రీ అజ్మీర చందూలాల్ గారు, శ్రీ పొన్నం ప్రభాకర్ గారు.

గౌ॥ డా॥ ఎస్. చెల్లప్ప, IAS గారు; శ్రీ SP సింగ్, IAS గారు; శ్రీ జె. ప్రభాకర్ రెడ్డి, IAS గారు; శ్రీ నిమ్మగడ్డ రమేష్ కుమార్, IAS గారు; శ్రీ రఫత్ అలీ, IAS గారు; శ్రీ శివశంకర్ IAS గారు; శ్రీ జయేశ్ రంజన్, IAS గారు; శ్రీ అధర్‌సిన్హా, IAS గారు; శ్రీ కె. రామకృష్ణారావు, IAS గారు; శ్రీ వికాస్ రాజ్, IAS గారు; శ్రీ నవీన్ మిట్టల్, IAS గారు; శ్రీమతి శాంతికుమారి, IAS గారు; శ్రీ అశోక్ కుమార్, IAS గారు; శ్రీ టి. చిరంజీవులు, IAS గారు; శ్రీ రాహుల్ బొజ్జా, IAS గారు; శ్రీ రఘునందన్, IAS గారు; శ్రీ రొనాల్డ్ రోస్, IAS గారు; శ్రీమతి విశాలాచ్చి, IPoS గారు; శ్రీమతి క్రిస్టినా చోంగ్తు, IAS గారు; శ్రీ దానకిషోర్, IAS గారు; శ్రీ సురేంద్రమోహన్, IAS గారు; శ్రీమతి చిత్రా రామచంద్రన్, IAS గారు; శ్రీ బసంత్ కుమార్, IAS గారు; శ్రీమతి వాకాటి కరుణ, IAS గారు; శ్రీ అరవిందర్ సింగ్, IAS గారు; శ్రీ కర్నన్, IAS గారు; శ్రీమతి యోగితా రాణా, IAS గారు; శ్రీ లోకేష్ కుమార్, IAS గారు; శ్రీమతి విజయేందిర, IAS గారు; శ్రీ చంపాలాల్, IAS గారు; శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, IAS గారు; శ్రీ విజయ్‌కుమార్, IAS గారు; శ్రీ హనుమంతరావు, IAS గారు; శ్రీమతి నిఖిల, IAS గారు; శ్రీ అనుదీప్, IAS గారు; శ్రీ ఆదర్శ్ సురభి, IAS గారు; శ్రీ వరుణ్‌రెడ్డి IAS గారు.

గౌ॥ శ్రీ మహేందర్ రెడ్డి, IPS గారు, శ్రీ విశ్వప్రసాద్, IPS గారు, శ్రీ మహేష్ భగవత్, IPS గారు.

గౌ॥ శ్రీమతి సునీత భగవత్, IFS గారు; శ్రీమతి ప్రియాంక వర్గీస్, IFS గారు; శ్రీ రాజశేఖరరెడ్డి గారు (సెక్రటరీ టు గౌ॥ సీయం); శ్రీ రాంమోహనరావు గారు (ఫైనాన్స్); శ్రీ నర్సింహాచార్యులు (అసెంబ్లీ సెక్రటరీ), ప్రొ॥ కె. కేశవులు గారు; శ్రీ రాయి రవి గారు; శ్రీ శ్యామ్ గారు.



గౌ॥ ప్రొ॥ ఘంటా చక్రపాణి గారు, శ్రీ సి.విఠల్ గారు, శ్రీ మంగారి రాజేందర్ గారు, శ్రీ కృష్ణారెడ్డి గారు, శ్రీ వి. ప్రకాష్ గారు, శ్రీ అల్లం నారాయణ గారు, డా॥ నందిని సిధారెడ్డి గారు, శ్రీ బి.ఎస్. రాములు గారు, శ్రీ బాదిమి శివకుమార్ గారు.

శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు, శ్రీ విజయ కుమార్ గటిక గారు, శ్రీ రమేష్ హజారీ గారు, శ్రీ సైదిరెడ్డి గారు, శ్రీ గౌలి శివకృష్ణ గారు, శ్రీ విజయ్ గారు, శ్రీమతి ఎం. సుజాత గారు, శ్రీ శేఖర్ గారు, కుమారి ప్రతిభ.

గౌరవ మంత్రివర్యుల సహాయకులు శ్రీ కన్నం సత్యనారాయణ గారు, శ్రీ సుశీల్ గారు, శ్రీ సురేందర్ గారు, శ్రీ సుధీర్ గారు, శ్రీ వెంకన్న గారు, YAT & C సెక్రటేరియట్ రమేష్ గారు, సోబర్స్ గారు, సతీష్ గారు, సుజాత గారు, రవి గారు.

శ్రీ బి. నరసింగరావు గారు, శ్రీ విజయేంద్ర ప్రసాద్ గారు, శ్రీ శేఖర్ కమ్ముల గారు, శ్రీ ఇంద్రగంటి మోహనకృష్ణ గారు, శ్రీ కళ్యాణకృష్ణ కురసాల గారు, శ్రీ అడవి శ్రీనివాస్ గారు, శ్రీమతి మేడపాటి రామలక్ష్మి – శ్రీ వెంకట్ గారు, శ్రీమతి ఝాన్సీ గారు, శ్రీ సాయికుమార్ గారు (హీరో), శ్రీ వేణు ఉడుగుల గారు, శ్రీ సాగర్ చంద్ర గారు, శ్రీ సంకల్ప్‌రెడ్డి గారు, శ్రీ తరుణ్ భాస్కర్ గారు, శ్రీ KVR మహేంద్ర గారు, శ్రీ అనిల్ కడియాల గారు, శ్రీమతి ప్రవీణ గారు, శ్రీ వెంకట్ సిద్ధారెడ్డి గారు, శ్రీమతి రంజిని గారు.

శ్రీ కె. శ్రీనివాస్ గారు, శ్రీ శ్రీనివాసరెడ్డి గారు, శ్రీ కట్టా శేఖర్ రెడ్డి గారు, శ్రీ తిగుళ్ళ కృష్ణమూర్తి గారు, శ్రీ పరాంకుశం వేణుగోపాలస్వామి గారు, శ్రీ గుడిపాటి గారు, శ్రీ రమేష్ వైట్ల గారు.

శ్రీ డా॥ కృతివెంటి శ్రీనివాస రావు గారు, శ్రీ డా॥ ఎన్. గోపి గారు, డా॥ నాళేశ్వరం శంకరం గారు, శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్ గారు, శ్రీ వేదకుమార్ గారు, డా॥ ఏలే లక్ష్మణ్ గారు.

డా॥ తాడేపల్లి శర్మ గారు, శ్రీ రంగినేని అభిలాష్ గారు, తెలంగాణ జాగృతి బాధ్యులు శ్రీ నవీనాచారి గారు, శ్రీ రాజీవ్ సాగర్ గారు, శ్రీ శరత్ గారు, శ్రీ సంతోష్ గారు, శ్రీ ప్రణీత్ గారు, శ్రీ పూర్ణచందర్ గారు.

శ్రీ కోరెం అశోక్ రెడ్డి గారు, శ్రీ వెంకట నర్సింహారెడ్డి గారు, శ్రీ పి. భాస్కరాచారి గారు, శ్రీమతి సుమిత్ర గారు, శ్రీ మనోహర్‌రావు *(TSTDC)* గారు, శ్రీ శంకరయ్య (శశాంక) – శ్రీమతి కవిత గారు, శ్రీ పొన్నం అశోక్ గారు, శ్రీ పొన్నం రవిచంద్ర గారు, శ్రీ పొన్నేరి సురేష్ కుమార్ గారు, శ్రీ నర్సయ్య (స్పోర్ట్స్) గారు, శ్రీ బాలాచారి నామోజు గారు.

శ్రీ గడ్డం భాస్కర్ గారు, శ్రీమతి నాగమణి గారు, డా॥ చంద్రశేఖర్ – శ్రీమతి శ్రీదేవి గారు, శ్రీ మామిడాల శ్రీనివాసరావు – శ్రీమతి రశ్మి గారు, శ్రీ నూతి మధుసూదన్, భాగ్య, వసుమతి గార్లు, శ్రీ వంకాయలపాటి మురళీధర్‌రావు గారు, శ్రీ నంద్యాల అనంతరెడ్డి గారు, శ్రీ నంద్యాల ప్రేమ్‌కరణ్ రెడ్డి గారు, శ్రీ బాసాని సురేష్, శ్రీ మట్టా రాజశేఖర్‌రెడ్డి, శ్రీ తండా యాదగిరి, శ్రీ పసునూటి వెంకటేశ్, శ్రీ మంత్రి శ్రీనివాస్, శ్రీ జావీద్, శ్రీ పి.వి.జి. సతీష్.

**భాషా సాంస్కృతిక శాఖ, రవీంద్రభారతి, లలిత కళాతోరణం సిబ్బందికి, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులకు....**

**అందరికీ కృతజ్ఞతలు.** **– మామిడి హరికృష్ణ**



# My Sincere Thanks to...

**Sri Kalvakuntla Chandrashekar Rao** *garu*
*Hon'ble Chief Minister, Govt. of Telangana*

***Sri K.T. Rama Rao*** *garu*
*Hon'ble Minister for MA&UD, Industries & IT E&C*

***Sri T. Harish Rao*** *garu*
*Hon'ble Minister for Finance*

***Dr. V. Srinivas Goud*** *garu*
*Hon'ble Minister for Excise & Prohibition, Sports, Tourism, Youth Services & Culture*

***Sri Singireddy Niranjan Reddy*** *garu*
*Hon'ble Minister for Agriculture, Co-operation, Marketing*

***Sri Joginapalli Santhosh Kumar*** *garu*
*Hon'ble Member of Parliament*

***Smt. Kalvakuntla Kavitha*** *garu*
*Ex. MP; Founder Presidnt - Jagruthi*

***Sri Somesh Kumar,*** *IAS*
*Chief Secretary, Govt. of Telangana*

***Sri Rajiv Sharma,*** *IAS (Retd.)*
*Chief Advisor to Govt.*

***Dr. K.V. Ramanachary,*** *IAS (Retd.)*
*Advisor to Govt.*

***Sri B.V. Papa Rao,*** *IAS (Retd.)*
*Former Advisor to Govt.*

***Dr. S.K. Joshi,*** *IAS (Retd.)*
*Advisor to Govt.*

***Sri G.R. Reddy,*** *IAS (Retd.)*
*Advisor to Govt.*

***Sri B.P. Acharya,*** *IAS*
*DG, MCRHRD*

***Sri Burra Venkatesham,*** *IAS*
*Principal Secretary, BC Development Dept.*

***Sri C. Partha Sarathi,*** *IAS*
*Principal Secretary*

***Sri B. Janardhan Reddy,*** *IAS*
*Principal Secretary, Agrl. & Co-op., Marketing*

***Sri Veera Brahmaiah,*** *IAS*
*Commissioner, Registrar of Co-op. Societies*

***Sri Bhoopal Reddy,*** *IFS (Retd.)*
*Secretary to Hon'ble CM*

***Sri Deshapathi Srinivas***
*OSD to Hon'ble C.M.*

**- Hari Krishna Mamidi**



# *Ontareekarana*

*(A solitude)*

అక్షరం - నిత్య అసంతృప్తవాది...!

మనస్సు అనే పరమాణువులో, ఆలోచనలు అనే **Orbital**లో అలజడితో, అలికిడితో నిరంతరం సంతృప్త స్థితి కోసం **Elliptical Shape**లో పచార్లు చేస్తూనే ఉంటుంది. పరిభ్రమిస్తూనే ఉంటుంది!

పదం - **Unrest**తో తండ్లాడే తాపసి...! ఉన్నచోట నిలవకుండా అర్థానర్థమో, అర్థరహితమో ఏదో ఒక వాక్యంగా పొదగడానికి నిత్యం సంచరిస్తూనే ఉంటుంది.

వాక్యమ్ - **Insecurity**తో బాధపడే లోకసంచారి...! ఒక కాడ ఆగకుండా గదిగదినీ వెదుక్కుంటూ, లోకాలన్నీ కలియదిరుగుతూ నిత్య అభద్రతతో చేతనాత్మక జాగరూకతతో ప్రయాణం చేస్తూనే ఉంటుంది.

కవిత్వం - మాత్రం ఒంటరి...!

**Demographics**లోని ఏకాంతవాసి...!

దాని దర్శనం మనం గుంపులో ఉన్నప్పుడు, మనలో గుంపులున్నప్పుడు సాధ్యం కాదు!

అన్ని వలువలూ, శాలువాలూ, భుజకీర్తులూ, గజమాలలూ, **Crowns, Queries** పరిత్యాగం చేసి నగ్న హృదయంతో మనల్ని మనం ఒలకపోసుకున్నప్పుడు, సాష్టాంగపడి వెక్కిళ్ళతో ఏడ్చినప్పుడు మాత్రమే కవిత్వం ప్రత్యక్షమవుతుంది. అలా నాకు గత దశాబ్ధాల కాలం నుంచి సాక్షాత్కారం అవుతూనే ఉంది.

**Overt**గానూ, **Covert**గానూ గుంపులో లేని వాన్ని కదా ... ఇంపులు, కంపులేవీ పట్టని వాన్ని కదా! అందుకే నా తెలీనితనంలోంచి నాకు కొంచెం తెలిసిందాన్ని మీతో పంచుకుందామనుకుంటున్నా... నాకు ప్రత్యక్షమైన అక్షరానుభవంలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నా...

నాకు అర్థమైనంతవరకూ -
కవిత్వం ఎప్పుడైనా ఒంటరే ...
కవితా సృజనే ఒంటరీకరణ ....!

- మామిడి హరికృష్ణ

ISBN 978-93-5457-352-1

9 789354 573521

Swarajyam Publications
Hyderabad